## డ్రైనేజ్ సమస్యను పరిష్కరించండి




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## బోడుప్పల్ వాకర్స్ అసోసియేషన్ ఏకగ్రీవం




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 181 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 27 జూన్ 2026

ఏపీ, తెలంగాణలో మూడ్రోజుల పాటు

# భారీ వర్షాలు

**వాతావరణశాఖ భారీ రెయిన్ అలర్ట్ జారీ**

**అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ**



**హైదరాబాద్,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** నైరుతి రుతుపవనాలు ఏపీలో విస్తరిస్తున్నాయి. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో భారీ మిగతా2లో...

## డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతిఒక్కరూ

# భాగస్వాములే...

**● ఈ మహమ్మారిని తరిమి కొట్టడంలో కలసి రండి ● ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు**



**హైదరాబాద్,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** సమాజాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు మిగతా2లో...



## 2047 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ సాధనే లక్ష్యం

**- కేంద్ర హోం మంత్రి అమిత్ షా**

**అమరావతి,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** వచ్చే 2047 నాటికి మాదక ద్రవ్య రహిత భారత్ (డ్రగ్స్ ఫ్రీ భారత్)సాధనే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపు నిచ్చారు. శుక్రవారం ఆయన ఢిల్లీ మిగతా2లో...

## పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఆగివున్న లారీని ఢీకొట్టిన తుపాను వాహనం**

**ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి**




## వెనిజులాలో భూకంపం.. 589కి చేరిన మరణాలు

**వెనిజులాల,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** వెనిజులాలో భూకంపంలో మృతుల సంఖ్య 589కి పెరిగింది. గాయపడిన వారి సంఖ్య 3 వేలకు చేరింది. ఈమేరకు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వివరాలు వెల్లడించారు. అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న లా గువేరా ప్రావిన్స్‌లో సహాయక చర్యల మిగతా2లో...



## డ్రగ్స్ రహిత తెలంగాణ

# మా లక్ష్యం

**● డ్రగ్స్‌పై పోరాటంలో ఈగిల్ ఫోర్స్ కృషి అసామాన్యం ● డ్రగ్స్ బారిన పడకుండా యువత జాగ్రత్త పడాలి ● ఈగిల్ ఫోర్స్ డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భట్టి**




**హైదరాబాద్,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** విలువైన జీవితాన్ని డ్రగ్స్ బారిన పడి నాశనం చేసుకోవద్దని విద్యార్థులు, యువతకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ మహమ్మారి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, అందరం కలిసికట్టుగా పోరాడినప్పుడే డ్రగ్స్ లేని సమాజాన్ని సాధించగలమని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రత్యేకంగా పనిచేస్తున్న ఈగల్ ఫోర్స్‌కు ఆర్థికంగా ఎలాంటి లోటు రాకుండా ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహకారాన్ని అందిస్తుందని భరోసా ఇచ్చారు. తమ పిల్లలు ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరుకునే తల్లిదండ్రుల ఆశ, మిగతా2లో...

## తెలంగాణలో 13 మంది

# ఐఏఎస్ బదిలీ






## 28న పల్స్ పోలియో

**హైదరాబాద్,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వేల ద్వారా పోలియో డ్రాప్స్ అందించాలని స్పష్టం చేశారు. జూబ్లిహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ మిగతా2లో...

## తిరుపతికి 2 బుల్లెట్ ట్రైన్స్!!



**హైదరాబాద్-చెన్నైమార్గం గుండా తిరుపతి**

**ప్రత్యేక బుల్లెట్ రైలు లింక్ కారిడార్ ప్రతిపాదన**

**ప్రతిపాదనకు లభించిన ప్రాథమిక అంగీకారం**

**త్వరలోనే కార్యరూపం దాల్చనున్న ప్రాజెక్టు**

**తిరుపతి,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన హైస్పీడ్ బుల్లెట్ రైలు ప్రాజెక్టుల మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కీలక కేంద్రంగా మారనుంది. హైదరాబాద్–అమరావతి–చెన్నై హైస్పీడ్ కారిడార్‌ను రాజధాని అమరావతి మీదుగా నిర్మించాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్హెచ్ఎస్ఆర్సీఎల్) సానుకూలంగా మిగతా2లో...

# తెలంగాణ కొత్త సీఎస్‌గా ఐఏఎస్ సంజయ్ జాజు

**● ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం ● 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి ● జూన్ 30తో ముగియనున్న రామకృష్ణారావు పదవీ కాలం**



**హైదరాబాద్,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో అత్యున్నత స్థాయిలో ఒక కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ప్రస్తుతం సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె. రామకృష్ణారావు సుదీర్ఘ పదవీ కాలం పొడిగించిన గడువుతో సహా జూన్ 30తో ముగియనుంది. అదే రోజున సంజయ్ జాజు రాష్ట్ర అత్యున్నత బ్యూరోక్రాటిక్ పదవిని స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను కేంద్ర సర్వీసుల నుండి రిలీవ్ చేసి మాతృ కేడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. సంజయ్ జాజుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్రంలోనూ అత్యంత సమర్థుడైన అధికారిగా పేరుంది. 1992 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన.. గతంలో ఉమ్మడి ఏపీలో ఐటీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా పనిచేసినప్పుడు నేటికీ మిగతా2లో...

## పాటిల్‌తో సీఎం ఏం మాట్లాడారో

# ప్రజలకు చెప్పాలి

**- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**



**హైదరాబాద్,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ప్రస్తావించిన ప్రాజెక్టులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడు తూ తుంగభద్ర అంశంపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని అన్నారు. తెలంగాణ కు ఆ రెండు ప్రాజెక్టుల నుంచి 15.9 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉండగా, కేవలం 5 టీఎంసీలే చూపిస్తున్నారని ఆరోపిం చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. కేసీఆర్ తెలంగాణకు రావాల్సిన వాటా కంటే తక్కువకు అంగీకరిం చారని పేర్కొన్నారు. అలాగే ఎస్ఐఆర్‌పై ఓవైసీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, భాజపా ఐడీ కార్డు మాత్రమే కాదు, పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు పత్రాల చెల్లుబాటుపై ఆయన చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు.

# ఏపీ, తెలంగాణలో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

వానలు పడగా.. అమరావతి వాతావరణ కేంద్రం భారీ వర్షసూచన జారీ చేసింది. జూన్ 26వ తేదీన అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పోలవరం, పశ్చిమగోదావరి, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇక మిగతా జిల్లాల్లో కూడా పిడుగులతో కూడిన వానలు కురిసే అవకాశముందని, పొలాల్లో ఉండే కూలీలు, రైతులు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వర్షాలు పడే సమయంలో సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని పేర్కొంది. ఈదురుగాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. నేడు ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. గడిచిన 24 గంటల్లో పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లిలో 5.2 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదవ్వగా.. కృష్ణా జిల్లా గుడివాడలో 3.5 సె.మీ, పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురంలో 3.5 సె.మీ, పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో 3.3 సె.మీ, ఏలూరు జిల్లా భీమడోలులో 3 సె.మీల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. ఇక ఏలూరు జిల్లా కైకలూరులో 2.9 సెంటీమీటర్లు, విజయనగరంలో 2.7 సె.మీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా అమలాపురంలో 2.6 సె.మీ, ఎన్టీఆర్ జిల్లా పాలేరు బ్రిడ్జి 2.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక రాయలసీమలో రాబోయే మూడ్రోజుల పాటు భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఈదురుగాలులు 40-50 కిలోమీటర్ల వేగంతో వీస్తాయిని తెలిపింది. ఇక కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురవనుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగనుంది. ఏపీపై కూడా ఎల్‌నినో ప్రభావం ఉంటుందని, పంటల సాగు విషయంలో ప్రత్యామ్నాయలను ఎంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అటు తెలంగాణలో రాబోయే మూడ్రోజుల పాటు భారీ వర్షాలకు ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. జూన్ 26,278వ తేదీల్లో మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని అంచనా వేసింది. ఇక జూన్ 27,28వ తేదీల్లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాలల్లో భారీ వానలు కురుస్తాయని తటిపింది. జూన్ 28,29వ తేదీల విష యానికొస్తే.. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది. పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక జారీ చేసింది.

# 2047 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ సాధనే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు,పోలీసు ఉన్నతాధికారులు,నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తదితర విభాగాల అధికారులతో నార్కో కోఆర్డినేషన్ పై వీడియో సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడి పిలుపు మేరకు 2047 నాటికి డ్రగ్స్ రహిత భారత్ సాధనే లక్ష్యంగా పని చేయాలని ఇందుకు సాంకేతికత సాయంతో పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలు సరఫరా, విక్రయం చేసే వారిపై కఠినంగా మరియు జీరో టోలరెన్స్‌గా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన హాట్ స్పాట్లను గుర్తించి కట్టుదిట్టమైన నిఘా ఉంచి కింగ్ పిన్ లను పెట్టుకోవడంతో పాటు వారికి సకాలంలో శిక్షపడేలా చూడాలన్నారు.ప్రత్యేక రోడ్డు మ్యాప్ ను రూపొందించుకోవడంతో పాటు కమ్యునిటీ పోలీసింగ్ ను మరింత పెంపొందించుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రాలకు స్పష్టం చేశారు.అదే విధంగా మాదక ద్రవ్యాల సేవనం, సరఫరా, విక్రయాల వల్ల కలిగే అనర్థాలు గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించాలని చెప్పారు.విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఎపిలో పోలీసు విభాగం ప్రత్యేక రాష్ట్ర స్థాయి మాదకద్రవ్య వ్యతిరేక దళం సమర్థవంతంగా పనిచేస్తోందని చెప్పారు.ఒకప్పుడు ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గంజాయి ప్రాంతంగా పేరుపొందిన ఆంధ్రప్రదేశ్ నేడు మాదకద్రవ్యాల నియంత్రణ అమలులో జాతీయ స్థాయిలో ఒక ఆదర్శప్రాయమైన ప్రమాణంగా నిలిచిందని అన్నారు. రైల్వే నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రాల మధ్య జరిగే మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోవడానికి ప్రతి జిల్లాలో వారానికి మూడుసార్లు స్థానిక పోలీసులు,జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్,ఈగిల్ మరియు శునక దళాలను సంయుక్తంగా మోహరించి పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు.ఈగల్ మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో ఒక ప్రత్యేకమైన, సురక్షితమైన డేటా సెంటర్ ను నిర్వహించడంతో పాటు రాష్ట్ర మాదకద్రవ్యాల నిరోధక వ్యవస్థకు కేంద్రీకృత నిఘా కేంద్రంగా పని చేస్తోందని తెలిపారు.ఈవీడియో సమావేశంలో ఈగల్ చీఫ్ ఐజిపి ఆకె రవికృష్ణ,ఈగల్ ఎస్పి ఆపరేషన్స్ కెయం. మహేశ్వర రాజు, విశాఖపట్నం ఎన్సిబి ఎస్పి జెడి పంకజ్,ఎన్సిబి డిఎస్పి కిరణ్ పాల్గొన్నారు.

# తిరుపతికి 2 బుల్లెట్ ట్రైన్స్!!

(మొదటి పేజీ తరువాయి)

స్పందించింది. అదే సమయంలో చెన్నై-బెంగళూరు కారిడార్‌లోని చిత్తూరును, హైదరాబాద్-చెన్నై మార్గంలోని తిరుపతితో అనుసంధానించే ప్రత్యేక బుల్లెట్ రైలు లింక్ కారిడార్ ప్రతిపాదనకు సైతం ప్రాథమిక అంగీకారం లభించింది. ఈ కీలక నిర్ణయంతో దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాలన్నీ ఒకే నెట్‌వర్క్‌తో అనుసంధానమయ్యే అద్భుత అవకాశం ఏర్పడింది. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ కారిడార్ మొత్తం 760.09 కిలోమీటర్ల మేర మూడు రాష్ట్రాల మీదుగా విస్తరించనుంది. ఇందులో తెలంగాణలో 180.32 కిలోమీటర్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా 518.54 కిలోమీటర్ల మేర మార్గం ఉండనుంది. తమిళనాడులో 61.23 కిలోమీటర్ల మేర ఈ మార్గం సాగుతుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 18 స్టేషన్లను ప్రతిపాదించారు. తెలంగాణలో హైదరాబాద్, శంషాబాద్ సహా ఆరు స్టేషన్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాలతో కలిపి తొమ్మిది స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు చిత్తూరు-తిరుపతి మధ్య సుమారు 65 కిలోమీటర్ల పొడవున ప్రత్యేక హైస్పీడ్ లింక్ కారిడార్ ఏర్పాటును ఎన్హెచ్ఎస్ఆర్సీఎల్ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. దీనికోసం తుది స్థల నిర్ధారణ సర్వే, వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకి సంస్థ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నివేదిక సిద్ధమైన వెంటనే కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖకు పంపి తుది ఆమోదం తీసుకోనున్నారు. ఈ లింక్ కారిడార్ అందుబాటులోకి వస్తే, బెంగళూరు నుంచి చిత్తూరు, తిరుపతి మీదుగా అమరావతి వరకు నేరుగా బుల్లెట్ రైలులో ప్రయాణించే వెసులుబాటు కలుగుతుంది.మరోవైపు 306 కిలోమీటర్ల పొడవైన చెన్నై-బెంగళూరు హైస్పీడ్ కారిడార్‌లో చిత్తూరు ప్రధాన స్టేషన్‌గా నిలవనుంది. ఇందులో తమిళనాడులో 133 కిలోమీటర్లు, కర్ణాటకలో 101 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 72 కిలోమీటర్ల మార్గం ఉండనుంది. మూడు రాష్ట్రాల్లో కలిపి మొత్తం ఏడు స్టేషన్లను ప్రతిపాదించారు. ఈ నెట్‌వర్క్ పూర్తయితే పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు ఊహించని రీతిలో భారీ ఊతం లభిస్తుంది. ముఖ్యంగా తిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే లక్షలాది భక్తులకు అత్యంత వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది.

# డ్రగ్స్ రహిత తెలంగాణ మా లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వ కల ఒక్కటేనని.. అది యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండటమేనని ఉద్ఘాటించారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన ఈగల్ ఫోర్స్ యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, సినీనటులు రామ్ పోతినేని, మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తారు. ఈ ప్రభుత్వం కూడా వారిని కాపాడుకోవాలని ప్రయత్నిస్తోంది. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నారు. తమ జీవితాలను రిస్క్‌లో పెట్టి డ్రగ్స్ ముఠాలను పట్టుకుంటున్నారు. డ్రగ్స్ కేసుల్లో దొరికితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని భట్టి హెచ్చరించారు. ఈగల్ ఫోర్స్ సంపూర్ణంగా పనిచేసేలా అన్ని వసతులు కల్పించాం. డ్రగ్స్ కట్టడికి ఎలాంటి కఠిన నిర్ణయమైనా తీసుకుంటాం. తెలంగాణలో పుట్టిపెరగడం ఓ భరోసాగా భావించే పరిస్థితులు కల్పిస్తున్నాం. సమాజంలో పరివర్తన రాకుంటే ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం శూన్యం. సినీ నటులు ఇచ్చే సందేశం సమాజంలోకి బలంగా వెళ్తుందని భట్టి విక్రమార్క అన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రాణాలకు తెగించి, నిరంతరం రిస్క్‌లో పనిచేస్తున్న పోలీస్ అధికారుల, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే అలాంటి ఉద్యోగులకు ప్రత్యేక ఇన్సెంటివ్స్ అందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని నమ్ముతూ, డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక అవేర్‌నెస్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా విద్యావ్యవస్థ బలోపేతం, రాష్ట్ర రక్షణ విషయాలలో ప్రభుత్వం ఎంతో కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. డ్రగ్స్ రవాణా లేదా వినియోగంలో ఎంతటి పెద్దవారు, ఎంతటి ప్రభావశీలురు ఉన్నా సరే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని భట్టి విక్రమార్క తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చలనచిత్ర రంగానికి చెందిన హీరోలు, హీరోయిన్లు, ఇతర కళాకారులు డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని శిల్పకళా వేదిక నుంచి ఆయన విజ్ఞప్తి చేశారు. సినీ పరిశ్రమలో ఉన్నవారు కూడా సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వానికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం తరఫున కఠినమైన చట్టాలు చేస్తున్నప్పటికీ, ప్రజల్లో మార్పు రానంతవరకు ఆశించిన ఫలితాలు రావని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. దేశంలో వరకట్న నిషేధ చట్టం ఉన్నప్పటికీ, అది ఆశించిన స్థాయిలో అమలు కాకపోవడానికి సామాజిక మార్పు లోపించడమే కారణమని ఉదాహరించారు. డ్రగ్స్ నిర్మూలన వంటి కఠినమైన చట్టాలు వంద శాతం విజయవంతం కావాలంటే, చట్టాలతో పాటు సమాజంలో, ప్రజల ఆలోచనా విధానంలో స్పష్టమైన పరివర్తన రావాలని ఆయన ఆకాంక్షించారు.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా ఐఏఎస్ సంజయ్ జాజు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు అందుబాటులో ఉన్న విప్లవాత్మక డిజిటల్ సేవలైన మీసేవ , మున్సిపల్ పరిధిలో సౌకర్యం ప్రాజెక్టులను డిజైన్ చేసి అమలు చేసిన ఘనత సాధించారు. అంతేకాకుండా, గతంలో ఉమ్మడి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విభజన తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రతినిధిగా పలు హోదాల్లో సేవలందించి క్షేత్రస్థాయి పరిపాలనపై తిరుగులేని పట్టు సాధించారు.సంజయ్ జాజు గత 13 ఏళ్లుగా కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర రక్షణ ఉత్పాదక శాఖ , కేంద్ర సమాచార-ప్రసారాల శాఖ సెక్రటరీగా దేశ డిజిటల్, రక్షణ రంగాల విధాన నిర్ణయాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణకు తిరిగి వచ్చే ముందు ఆయన కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్రంలో సుదీర్ఘ కాలం పనిచేయడం వల్ల దిల్లీ సర్కిళ్లలో గల ఉన్నతాధికారులు, వివిధ మంత్రిత్వ శాఖలతో ఆయనకు ఉన్న బలమైన నెట్‌వర్క్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగపడనుందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి.ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ విరమణ తరుణంలో రేసులో జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి పలువురు సీనియర్ల పేర్లు వినిపించినప్పటికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. దీనికి ప్రధాన కారణం ఆయనకున్న క్లీన్ ఇమేజ్ , వివాదరహిత ట్రాక్ రికార్డ్. రాష్ట్రంలో గుణాత్మక మార్పులు, పాలనా సంస్కరణలు తేవాలని భావిస్తున్న రేవంత్ రెడ్డికి.. ఐటీ, డిజిటల్ పరిపాలనలో ఎక్స్‌పర్ట్ అయిన జాజు అయితేనే కరెక్ట్ అని భావించారు. అంతేకాకుండా, కేంద్ర నిధుల సాధనలోను, కేంద్ర-రాష్ట్రాల మధ్య పెండింగ్ జలవివాదాలు, విభజన సమస్యల పరిష్కారంలో జాజుకు దిల్లీలో ఉన్న సీనియారిటీ మరియు పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరామరక్షగా మారుతుందని సీఎం గట్టిగా విశ్వసించారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మాతృ రాష్ట్రానికి తిరిగి వస్తున్న సంజయ్ జాజుకు సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించగానే పలు సవాళ్లు ఎదురుకానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గ్యారెంటీల అమలు, రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పరిపాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. ఒకవైపు ఐటీ విజనరీగా, మరోవైపు కఠినమైన టాస్క్ మాస్టర్‌గా పేరు తెచ్చుకున్న సంజయ్ జాజు.. రాబోయే రోజుల్లో తెలంగాణ బ్యూరోక్రసీని ఏ విధంగా లీడ్ చేస్తారనేది సచివాలయ ఉద్యోగ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**పల్నాడు,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):**పల్నాడు జిల్లాలో.. ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.. నలుగురు మృతి చెందారు. జిల్లాలోని.. మాచర్ల నగరవనం దగ్గర ఆగివున్న లారీని తుపాను వాహనం ఢీకొట్టింది. దీంతో వాహనంలోని నలుగురు అక్కడికక్కడే చనిపోయారు. మరికొందరు గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. మృతులంతా హైదరాబాద్ వాసులుగా తెలిసింది. బంధువులు మృతి చెందడంతో తుపాను వాహనంలో పామూరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదం కలిగించింది. విషయం తెలుసుకున్న స్థానికులు.. అయ్యో అంటున్నారు. చనిపోయిన వారి బంధువులను ఓదార్చేందుకు వెళ్తూ.. చనిపోవడం అనేది వారిని కలచివేసింది. తుపాను వాహనం అతివేగంతో రావడం వల్ల ఈ ప్రమాదం జరిగివుంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఐతే.. మన ఏపీ, తెలంగాణలో రోడ్లపై తరచూ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కొన్ని చోట్ల స్ట్రీట్ లైట్లు ఉండట్లేదు. మరికొన్ని చోట్ల రోడ్లపై గతుకులు బాగా ఉంటున్నాయి. అతివేగం చాలా ప్రాణాలు తీస్తోంది. వాహనం వేగంగా వెళ్లేదైనా.. నెమ్మదిగా వెళ్లడం మేలు. ఇలాంటి ప్రమాదాల్లో చాలా ప్రాణాలు కోల్పోతుంటే.. వారి కుటుంబ సభ్యులు అనేక రకాలుగా కష్టాల్లో పడుతున్నారు.

# వెనిజులాలో భూకంపం.. 589కి చేరిన మరణాలు

(మొదటి పేజీ తరువాయి)

కోసం సైనికులను మోహరిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు వందలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయారని ప్రభుత్వం అంచనా వేసింది. గల్లంతైన వారి వివరాలను స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో శుక్రవారం ఉదయం నాటికి 50 వేల మంది పేర్లు నమోదయ్యాయి.

# డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతిఒక్కరూ భాగస్వాములే...

(మొదటి పేజీ తరువాయి)

స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతిఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# తెలంగాణలో 13 మంది ఐఏఎస్ బదిలీ

**హైదరాబాద్ జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):**

తెలంగాణలో 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్ నియమితులయ్యారు. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జాను నియమించారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అటవీ శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్ నియమితులు కాగా.. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

# 28న పల్స్ పోలియో

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా పోలియో బూత్‌లలో డ్రాప్స్ వేయనున్నట్లు తెలిపారు. ఈనెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి వివరించారు.హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు విస్తృతంగా ఉండటంతో జూలై 1న అదనంగా మరో రోజు కార్యక్రమాన్ని నిర్వహించాలని మంత్రి సూచించారు.వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని బస్తీలు, కొత్త కాలనీలు, గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆర్టీసీ తదితర శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. తెలంగాణలో చివరి పోలియో కేసు 2007లో నమోదు అయిందని, పోలియో రహిత తెలంగాణ లక్ష్యాన్ని ఉమ్మడి రాష్ట్రంలోనే సాధించామని ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేశారు. జూన్ 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో టీకా వేయించాలని మంత్రి తెలిపారు. గతంలో పోలియో చుక్కలు వేయించినా మరోసారి వేయించడం వల్లే పూర్తి రక్షణ లభిస్తుందని చెప్పారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి టీకా వేయించాలని, ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా అందరూ సహకరించి తెలంగాణ, దేశం పోలియో రహిత హోదాను కొనసాగిద్దాం అని మంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు.ఏర్పాట్లు పూర్తి పల్స్ పోలియో కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా 22,979 పోలియో బూత్‌లు, 903 మొబైల్ బృందాలు, 903 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేశారు. సుమారు 40.97 లక్షల మంది 0- నుంచి 5 ఏళ్ల చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందుకోసం 52.04 లక్షల బీవోపీవీ టీకా డోసులు జిల్లాలకు సరఫరా చేశారు. కార్యక్రమంలో 8,393 ఏఎన్ఎంలు, 27,181 ఆశా కార్యకర్తలు, 34,442 అంగన్‌వాడీ కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు.

# అయోధ్య ట్రస్ట్ అవినీతిపై వాస్తవాలు వెల్లడించాలి :ఎంపి చామల

**హైదరాబాద్ జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):**అయోధ్య రామ జన్మభూమి ట్రస్ట్ అవినీతి వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ప్రజలకు వాస్తవాలు చెప్పాలని భువనగిరి కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్‌కు సంబంధించి ఎలాంటి అవినీతి జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారని, కాగా యూపీ సిట్ పోలీసులు చంపత్ రాయ్ మనుషులను అరెస్టు చేశారని ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని విరాళాలు వసూలు చేశారని ఆయన ఆరోపించారు.



# టిఎస్ఎస్‌డబ్ల్యూజేఏ ఆధ్వర్యంలో 29న ఐ&పిఆర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

**అక్రిడేషన్ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్**

**దళిత, గిరిజన జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని సంఘం నాయకుల వెల్లడి**

**మేడ్చల్ జిల్లా ప్రెస్‌మీట్‌లో ప్రకటించిన నాయకులు**



**ఉప్పల్, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న హైదరాబాద్‌లోని ఐ & పి ఆర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర ఉత్సవ సమితి చైర్మన్ ఎల్ల సంతోష్ కుమార్, వైస్ చైర్మన్ ఇడపాక సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల మంజూరులో జరుగుతున్న వివక్షను నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.అక్రిడేషన్ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కమిటీల్లో ఇతర వర్గాల ఆధిపత్యం కొనసాగిస్తూ దళిత, గిరిజన జర్నలిస్టులను పక్కన పెట్టే విధానాన్ని నిలిపివేయాలని కోరారు.దళిత, గిరిజన జర్నలిస్టులకు అక్రిడేషన్ కమిటీల్లో స్థానం కల్పించినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో దళిత, గిరిజన జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న వారి పిల్లలకు నూరుశాతం రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ ముట్టడి కార్యక్రమానికి దళిత, గిరిజన జర్నలిస్టులు, సంఘాలు, ప్రజాసంఘాలు, సామాజిక న్యాయవాదులు మద్దతు తెలిపి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ పిలుపునిచ్చింది.ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దత్రపు దేవా, నెమ్మది వెంకన్న, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా నాయకులు కందుకూరి ప్రశాంత్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజ్ సమస్యను పరిష్కరించండి

**మురుగునీరు ఇంటి ముందు నిలిచి అనారోగ్యాలు వస్తున్నాయి**

**కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు**

**విలేకరుల సమావేశంలో బాధితురాలు పేర్ని త్రివేణి ఆవేదన**




**ఖమ్మం, ప్రతినిధి జూన్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం కార్పొరేషన్ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య ధోరణి తో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, ఇంటి ముందు మురుగునీరు నిలిచి తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ప్రకాష్ నగర్ కు చెందిన బాధితురాలు పేర్ని త్రివేణి ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పేర్ని త్రివేణి మాట్లాడుతూ.. ఖమ్మం నగరంలోని 28వ డివిజన్ ప్రకాష్ నగర్ 5వ లైన్ 4-7-125/1 ఇంటి వద్ద ఎగువ నుంచి వచ్చే మురుగునీరు నిలిచి తీవ్ర అసౌకర్యంగా మారిందని, ఈ సమస్యను పరిష్కరించమని ఇప్పటికే అనేకమార్లు మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి తెలియజేసిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటికి ఎదురుగా ఉన్న కొంతమంది వ్యక్తులు రాంపులు ఎత్తుగా ఏర్పాటు చేసుకొని కార్లు, ఇతర వాహనాలు నిలుపుకుంటున్నారని, ఇష్టానుసారంగా చెత్త చెందారని కాలువలోకి నెట్టి మురుగునీరు నిలిచి ఉండేందుకు దోహదపడుతుందని తెలిపారు. కాల్వ నిర్మాణాలు కొంతవరకు చేపట్టి నిలిపివేశారని, కాలువ డైవర్షన్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కాల్వ నిర్మాణాలు సక్రమంగా చేయకపోవడం వల్ల మురుగు నీరు నిలిచి దోమలు వృద్ధి చెంది తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేకమార్లు మున్సిపల్ అధికారులు వారి సిబ్బంది దృష్టికి తీసుకు వెళ్ళామని, ఆర్టిఐ కింద దరఖాస్తు చేశామని, సైడ్ కాల్వలను అధ్వానంగా చేసిన వారిపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామని అయినా కూడా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వెల్లబుచ్చారు. ఇప్పటికే తన తండ్రి చనిపోయాడని,తనకు తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి ఎగువ నుంచి వచ్చే మురుగునీరు సక్రమంగా దిగువకు వెళ్లే విధంగా సైడ్ కాల్వ నిర్మాణాలు చేపట్టాలని, మురుగు నీటి నిల్వ, చెత్తాచెదారం సమస్య లేకుండా చూడాలని , రోడ్డును ఆక్రమించి ఎత్తుగా ర్యాంపులు ఏర్పాటు చేసుకున్న వాటిని తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జీవీఆర్ కరాటే అకాడమి








**హైదరాబాద్, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ పర్యవేక్షణలో శుక్రవారం కాచిగూడ లోని జీవీఆర్ కరాటే అకాడమీ లో నిర్వహించిన కార్యక్రమంలో కరాటే విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారు. కరాటే మాస్టర్ డాక్టర్ జివిఎస్ గోపాల్ రెడ్డి కరాటే విద్యార్థులైన భార్గవసాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియాలతో కలిసి ఈ రికార్డు చేశారు. 36 సెకండ్లలో 6 మంది విద్యార్థుల తలలపై ఉంచిన 26 యాపిల్స్ను చేతితో బ్రేక్ చేసి రికార్డు సృష్టించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ రికార్డు చేసిన గోపాల్ రెడ్డి తో పాటు విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ను అందజేశారు. కార్యక్రమంలో కార్పొ రేటర్లు మహాలక్ష్మి రామన్ గౌడ్, కన్నె ఉమా రమేష్ యాదవ్, డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, కోట్ల నిరంజన్ రెడ్డి, కరీమ్, అమృతరెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ, ద్వైత తదితరులు పాల్గొని రికార్డు గ్రహీతలు అభినందించి సత్కరించారు. జివిఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి తన అసాధారణ కరాటే నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ.. ఆరుగురు విద్యార్థుల తలపై ఉంచిన 26 ఆపిల్స్‌ను కేవలం 36 సెకన్లలో హ్యాండ్ చాప్స్ ద్వారా బ్రేక్ చేసి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ శ్రీ బింగి నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమాజానికి చైతన్యాన్ని కలిగించే సందేశంతో ఈ ప్రపంచ రికార్డును నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కేవలం 36 సెకన్లలో అత్యంత క్రమశిక్షణ, ఏకాగ్రత, భద్రతా ప్రమాణాలతో ఈ విన్యాసాన్ని విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డిని అభినందించారు. ప్రపంచ రికార్డులు కేవలం ప్రతిభను ప్రదర్శించడానికి మాత్రమే కాకుండా సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని అందించేలా ఉండాలని, ఆ దిశగా డాక్టర్ గోపాల్ రెడ్డి ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే ఈ రికార్డులో పాల్గొన్న భార్గవ సాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియ లను ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి ధైర్యం, విశ్వాసం, క్రమశిక్షణ ఈ ప్రపంచ రికార్డు విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు జివిఆర్ కరాటే అకాడమీ బృందానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ప్రపంచ రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, మాజీ కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, వివేక్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎ. కృష్ణా రెడ్డి, నేతాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకులు మరియు డైరెక్టర్ కోట్ల నిరంజన్ రెడ్డి, జివిఆర్ కరాటే అకాడమీ బ్లాక్ బెల్ట్స్ కరీమ్, అమృత రెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ, ద్వైతతో పాటు అకాడమీ విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి మరియు విద్యార్థులను అభినందించారు. ఈ ప్రపంచ రికార్డు ద్వారా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలు, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జివిఆర్ కరాటే అకాడమీ పిలుపునిచ్చింది.


# చిన్నారి ఆరాధ్యకు మున్నూరుకాపు ప్రముఖుల ఆశీస్సులు

- **పట్టు వస్త్రాలంకరణ వేడుకలో పాల్గొని అక్షింతలు వేసిన ఆకుల గాంధీ, పొదిల రవికుమార్ తదితరులు**



**ఖమ్మం, ప్రతినిధి జూన్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఖమ్మం నగరంలోని స్టేషన్ రోడ్డులో గల హోటల్ శాంతిలో చిన్నారి ఆరాధ్య నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, ప్రముఖులు పొదిల రవికుమార్, మున్నూరుకాపు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, ఖమ్మం జిల్లా యూత్ అధ్యక్షులు తోట రమేష్ తదితర ప్రముఖులు హాజరై చిన్నారి ఆరాధ్యకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఖమ్మం వాస్తవ్యులు నిమ్మల నవీన్‌షామిల దంపతుల ముద్దుల తనయ ఆరాధ్య పట్టు వస్త్రాలంకరణ వేడుక సందర్భంగా ప్రముఖులు ఆమెకు మంచి భవిష్యత్తు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారి తల్లిదండ్రులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖులు చౌడం నర్సింహారావు, ఆకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య: ఎస్ఐ సతీష్



**చిట్యాల, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** శారీరక అనారోగ్యం, కంటిచూపు మందగించడంతో మనస్తాపానికి గురై ఒక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిట్యాల మండలం ఒడితల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం...ఒడితల గ్రామానికి చెందిన తెలకుంట్ల సమ్మయ్య (76), తండ్రి రాజీరు, గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. గత ఏడాది కాలంగా ఆయనకు రెండు కళ్ళు పూర్తిగా కనిపించకపోవడంతో, పక్షవాతం లక్షణాలు ఉన్న తన భార్య రాజవ్వ సహాయంతోనే దినచర్యలు సాగించేవారు. కళ్ళు కనిపించకపోవడం వల్ల తను భార్యాపిల్లలకు బరువుగా మారాననే తీవ్ర మనస్తాపంలో సమ్మయ్య గురువారంరాత్రి సుమారు 10:00 గంటల సమయంలో భోజనం చేసిన అనంతరం సమ్మయ్య నిద్రపోయారు. ఈరోజు తెల్లవారుజామున 4:00 గంటల ప్రాంతంలో భార్య రాజవ్వ లేచి చూసేసరికి, సమ్మయ్య బయటి బాత్రూమ్ కర్రకు నిచ్చెన సహాయంతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించారు. ఆమె గమనించి వెంటనే కుమారుడైన తెలకుంట్ల తిరుపతిని పిలిచింది. తిరుపతి తన పొరుగున ఉన్న బండారి మహేందర్ సహాయంతో ఉరితాడును కోసి కిందకు దించగా, అప్పటికే సమ్మయ్య మృతి చెంది ఉన్నారు. మృతుని కుమారుడు తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిట్యాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

# బోడుప్పల్ వాకర్స్ అసోసియేషన్ ఏకగ్రీవం



**బోడుప్పల్ జూన్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):**బోడుప్పల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా కట్ట బాల్ రెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది గౌరవాధ్యక్షులు పిసాటి అంజి రెడ్డి గారిని ప్రహల్లాద రెడ్డి జనరల్ సెక్రెటరీ ప్రభాకర్, ట్రెజరర్ ఆనంద్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్. ఈ కార్యక్రమానికి గ్రూపుకు అనుబంధంగా ఉన్నారు రసాల వెంకటేష్ యాదవ్,జడగ మల్లయ్య (పెద్ద గొల్ల) తోటకూర వెంకటేశ్ యాదవ్,రాంబాబు,వెంకటేశ్వరరావు భాస్కర్ చారి,తిరుపతి రెడ్డి, మల్లన్న,సత్యనారాయణ, మల్లికార్జున్,తిరుపతి రెడ్డి.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు అధ్యక్షుడు మాట్లాడుతూ పార్కులో ప్రతి డెవలప్మెంట్ కు నేను రిటైర్మెంట్ అయి ఉన్న కాబట్టి అధికారుల దృష్టికి వెళ్లి పార్క్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది, పార్కులో వ్యాయామం నడక వల్ల ఆరోగ్యం మన చేతుల్లో ఉంటదని నడక జీవితాన్ని నిలబెడుతుందని ఈ వాకర్స్ అసోసియేషన్ వల్ల ఒకరికి ఒకరు అనుబంధాలు ప్రేమలు ఏర్పడడం వల్ల మనశ్శాంతి కలుగుతుందని ఇలాంటి కార్యక్రమాల వల్ల మనకు మన కుటుంబ సభ్యులకు అన్యోన్యత ఆత్మీయత కలుగుతుందని జీవితంలో నడక అనేది జన్మించినప్పటి నుంచి జన్మ అంతమయ్యే వరకు నడక లేనిదే జీవితం లేదని ఇలాంటి పార్కులను ఉపయోగించడం వల్ల ప్రజల ఆరోగ్యాలు మెరుగుపడతాయని పలువురు వాకర్లు తెలియజేశారు.

# నాణ్యతకు మారుపేరు శ్రీ ఆంజనేయస్వామి పాల కేంద్రం

- **ఖమ్మం ప్రజలకు స్వచ్ఛమైన పాలు, రుచికరమైన పెరుగు, నాణ్యమైన బియ్యం అందుబాటులో**




**ఖమ్మం, ప్రతినిధి జూన్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** నగర ప్రజలకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో టీడీపీ ఆఫీస్ పక్కన, కూరగాయల మార్కెట్ ఎదురుగా ఏర్పాటు చేసిన "శ్రీ ఆంజనేయస్వామి పాల కేంద్రం" వినియోగదారుల ఆదరణ పొందుతోంది.ప్రజల ఆరోగ్యం కోసం స్వచ్ఛమైన, తాజా పాలను అందించడంతో పాటు రుచికరమైన పెరుగు, అత్యుత్తమ శ్రేణి బియ్యాన్ని సరసమైన ధరలకు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాణ్యత, నమ్మకం, పారదర్శక సేవలే తమ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.ప్రతి కుటుంబానికి ఆరోగ్యకరమైన ఆహారం అందించాలనే ఉద్దేశంతో ఎలాంటి రాజీ లేకుండా నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఒకసారి సందర్శించిన ప్రతి వినియోగదారుడు మళ్లీ రావాలనుకునేలా ఉత్తమ సేవలు అందిస్తున్నామని చెప్పారు.


# పీఎం శ్రీ నిధుల మాయం...?






### బిల్లులకే పరిమితమైన విచారణ..!
### సామగ్రి తనిఖీ లేకుండానే
### అధికారుల వెనుదిరుగు..?
### అడవిమల్లెల గురుకులంలో అవకతవకల ఆరోపణలు.. కలెక్టర్ తక్షణ జోక్యం కోరుతున్న పేరెంట్స్ కమిటీ
### పారదర్శక విచారణ జరపకపోతే హాస్టల్ ఎదుట బైఠాయింపు హెచ్చరిక

**పెనుబల్లి, జూన్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం అడవిమల్లెల సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల పాఠశాల, కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం శ్రీ పథకం నిధుల వినియోగంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పథకం కింద లక్షల రూపాయల విలువైన సామగ్రి కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు విచారణకు వచ్చినప్పటికీ, కేవలం బిల్లులను మాత్రమే పరిశీలించి, ఆ బిల్లుల్లో చూపిన సామగ్రి వాస్తవంగా పాఠశాలలో ఉందా లేదా అనే విషయాన్ని తనిఖీ చేయకుండానే వెళ్లిపోయారనే ఆరోపణలు ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. విచారణ పేరుతో కేవలం ఫైళ్లను పరిశీలించి, భౌతిక తనిఖీ చేయకపోవడంపై పేరెంట్స్ కమిటీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల్లో నమోదైన ఫర్నిచర్, డిజిటల్ పరికరాలు, విద్యా సామగ్రి, ఇతర వస్తువులు నిజంగా కొనుగోలు చేశారా..? ప్రస్తుతం పాఠశాలలో అందుబాటులో ఉన్నాయా..? అనే అంశాలపై ఎలాంటి పరిశీలన జరగలేదని వారు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల కోసం ఖర్చు చేయాల్సిన ప్రజాధనం దుర్వినియోగం అయి ఉంటే, దానిని వెలికితీయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, కానీ విచారణ మాత్రం కేవలం కాగితాలకే పరిమితమవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. పేరెంట్స్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కేవలం బిల్లులు చూడటం వల్ల నిజాలు బయటపడవు బిల్లుల్లో ఉన్న ప్రతి వస్తువును భౌతికంగా పరిశీలించి, స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు వివరాలు, వినియోగ స్థితిని పరిశీలించినప్పుడే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. లేదంటే విచారణపై ప్రజలకు నమ్మకం ఉండదు అని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని, సీనియర్ అధికారులతో



ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర, నిష్పాక్షిక, పారదర్శక విచారణ నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. విచారణలో బాధ్యులు ఎవరైనా తేలితే వారిపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కూడా కోరుతున్నారు. తమ డిమాండ్లను అధికారులు పట్టించుకోకపోతే హాస్టల్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టడంతో పాటు, జిల్లా కేంద్రంలో



నిరసనలు నిర్వహిస్తామని పేరెంట్స్ కమిటీ హెచ్చరించింది. ప్రభుత్వం విద్యా రంగానికి కేటాయిస్తున్న ప్రతి రూపాయి విద్యార్థుల అభివృద్ధికే వినియోగం కావాలే గానీ, అక్రమాలకు ఆస్కారం కల్పించే పరిస్థితి ఉండకూడదని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం ఎలా స్పందిస్తుంది..? ఆరోపణల్లో ఎంతవరకు వాస్తవం ఉంది...? పూర్తి స్థాయి విచారణలో అసలు నిజాలు వెలుగులోకి వస్తాయా..? అనే అంశాలు ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

---

# విద్యార్థుల చేతుల్లోనే మాధకద్రవ్యాల నిర్మూలన

### కల్లూరు ఎసిపి వసుంధర యాదవ్

**సత్తుపల్లి, జూన్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్)** :మాదకద్రవ్యాల నిర్మూలన నేటి తరం విద్యార్థుల చేతుల్లోనే ఉందని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ అన్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రజలకు అవగాహన కల్పించేందుకు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలో సత్తుపల్లిలోని త్రివేణి పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు ఏసీపీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నివారణ సమాజంలో అందరి బాధ్యతని, యువత మాదకద్రవ్యాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును




బుగ్గిపాలు చేసుకోవొద్దని అన్నారు. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల రవాణా అధికంగా జరుగుతుందన్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం దృష్టిసారించిందన్నారు. పెడదారి పడుతున్న యువతకు కళాశాలల్లో కౌన్సిలింగ్ కల్పించాలని తల్లిదండ్రులు సైతం పిల్లల ప్రవర్తన పై దృష్టి సాధించాలని




సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ తుమ్మలపల్లి శ్రీహరి, ఎస్సై, పోలీస్ సిబ్బంది, మురళీకృష్ణ, అప్పారావు, కళాశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

---

# ఆయిల్ పామ్ సాగు రైతులకు స్థిరమైన ఆదాయానికి మార్గం: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



**వేంసూర్, జూన్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేంసూర్ మండలం కల్లూరుగూడెం గ్రామంలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలో నిర్వహించిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయకమైన పంట అని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, సాంకేతిక సలహాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ పరిశ్రమ అభివృద్ధితో రైతులకు మార్కెటింగ్ సమస్యలు తగ్గడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సహాయం అందించాలని, ఆయిల్ పామ్ సాగు విస్తరణకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

---

# ప్రపంచ శాంతి కోసం హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు

### రష్యా, ఫ్రాన్స్ సహా పలు దేశాల ప్రతినిధుల సమక్షంలో గ్లోబల్ పీస్ కాన్ఫరెన్స్

**హైదరాబాద్, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ న్యూస్ ఛానల్ మరియు బ్లిస్ బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హోప్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ లో "గ్లోబల్ పీస్ కాన్ఫరెన్స్" ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి రష్యా, ఫ్రాన్స్, అమెరికా తదితర దేశాలకు చెందిన అంతర్జాతీయ దౌత్యవేత్తలు, శాంతి దూతలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరై ప్రపంచ శాంతి, మానవతా విలువలు, అంతర్జాతీయ సహకారం, దౌత్య సంబంధాల బలోపేతంపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సదస్సులో గ్లోబల్ ప్రెసిడెంట్ ఇంటర్నేషనల్ డిప్లొమాటిక్ క్లబ్, బ్రిక్స్ కల్చర్ అండ్ మీడియా ఫోరం ఉపాధ్యక్షుడు, ఐక్యరాజ్యసమితి యూపీఎఫ్ పీస్ అంబాసిడర్ డా. సెర్గే ద్వోర్యానోవ్, వరల్డ్ అలయన్స్ "పీస్‌మేకర్" వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి యూరీ సఫ్రోనోవ్, ప్రముఖ న్యూస్ ఛానల్ చైర్మన్ లక్ష్మీరావు,



జాతీయ నాయకుడు, ప్రముఖ సామాజికవేత్త దుండ్ర కుమారస్వామి, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా మాట్లాడుతూ దేశాల మధ్య పోటీ సహజమేనని, కానీ శత్రుత్వానికి తావు ఉండకూడదని అన్నారు. ప్రపంచ భవిష్యత్తుకు సహకారమే మార్గమని, శాంతి నెలకొంటేనే రైతుకు పంట, యువతకు ఉపాధి, పిల్లలకు విద్య, మహిళలకు భద్రత లభిస్తాయని పేర్కొన్నారు. ప్రముఖ ఛానల్ చైర్మన్ లక్ష్మీరావు మాట్లాడుతూ భారతదేశం వేల ఏళ్ల క్రితమే "వసుధైవ కుటుంబకం" అనే సందేశాన్ని ప్రపంచానికి అందించిందని, ప్రపంచమంతా ఒకే కుటుంబమనే భావనతో మానవత్వం, స్నేహం, శాంతి కోసం అన్ని దేశాలు కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జాతీయ నాయకుడు దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ దేశాల సరిహద్దులు వేరైనా, మానవత్వానికి సరిహద్దులు ఉండవని, ప్రపంచాన్ని ఏకం చేసే శక్తి శాంతి మాత్రమేనని అన్నారు. ప్రపంచంలో అత్యంత విలువైన సంపద మనిషి ప్రాణమని, యుద్ధం విధ్వంసాన్ని సృష్టిస్తే శాంతి అభివృద్ధికి మార్గం చూపుతుందని పేర్కొన్నారు. తుపాకులు సమస్యలను పరిష్కరించలేవని, సంభాషణలు, దౌత్య సంబంధాల ద్వారానే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని చెప్పారు. ఆయుధాలపై చేసే వ్యయంకంటే విద్య, వైద్యం, మానవాభివృద్ధిపై పెట్టుబడులు ప్రపంచానికి మరింత మేలు చేస్తాయని, యుద్ధంలో గెలిచిన దేశాలు చరిత్రలో నిలిచినా, శాంతిని కాపాడిన నాయకులు మానవ హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన దౌత్య ప్రతినిధులు, సామాజికవేత్తలు, ప్రజాప్రతినిధులు, మేధావులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

# ఘనంగా డాక్టర్ బి.వి.చారి జన్మదిన వేడుకలు

### ● హమాలీ ఆవిర్భావ సభకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కేటీఆర్‌ను ఆహ్వానించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్ జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ని మర్యాదపూర్వకంగా కలిసి, జూలై 6 వ మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్ విఎన్ఆర్ గార్డెన్ లో నిర్వహించనున్న హమాలీ ఆవిర్భావ సభకు ముఖ్య అతిథిగా హాజరై సభను విజయవంతం చేయాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా హమాలీ కార్మికుల సంక్షేమం వారి సమస్యలు, సంఘం చేపడుతున్న కార్యక్రమాల గురించి కేటీఆర్ కి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హమాలీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హబ్సిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు డాక్టర్. బి. వి. చారి పుట్టిన రోజు సందర్భంగా కేటీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

---

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పనుల పరిశీలన: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

### పోలింగ్ కేంద్రాల్లో ఎన్యూమరేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో తనిఖీ
### పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

**తల్లాడ, జూన్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ సర్ 2026 కార్యక్రమంలో భాగంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ శుక్రవారం తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామం పోలింగ్ స్టేషన్ నెం. 4, 8, కొత్తవెంకటగిరి గ్రామం పోలింగ్ స్టేషన్ నెం.15లను సందర్శించి నారు. సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ ప్రక్రియను



క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారాల పంపిణీ తీరును పరిశీలించి, ప్రతి అర్హులైన ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించి, ఎలాంటి అర్హులైన ఓటరు మిగిలిపోకుండా ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా ఎన్యూమరేషన్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. తల్లాడ మండల తాసిల్దార్ కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.



---

# కురుసం రమేష్ వివాహానికి మంత్రి సీతక్క ఆహ్వానం.. పెళ్లికి వస్తానని హామీ

### - గోవిందరావుపేట మండలం పుట్‌ఫారం గ్రామంలో ఆనందం



**ములుగు జిల్లా,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** గోవిందరావుపేట మండలం పుట్‌ఫారం గ్రామానికి చెందిన కురుసం సమ్మయ్యమల్లమ్మ దంపతుల కుమారుడు కురుసం రమేష్ వివాహ వేడుకకు రాష్ట్ర మంత్రి సీతక్కను కుటుంబ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కను కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆహ్వానాన్ని స్వీకరించిన మంత్రి సీతక్క, వివాహ వేడుకకు తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుటుంబ శుభకార్యానికి మంత్రి స్పందించి రావడానికి అంగీకరించడం పట్ల కురుసం సమ్మయ్యమల్లమ్మ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలతో మమేకమై వారి కుటుంబ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతున్న మంత్రి సీతక్కకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15 నాటికి కల్లూరుగూడెం ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించాలి

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు**

**దేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణలో తెలంగాణ నెంబర్-1... గత ఐదేళ్లలో కొత్తగా సాగులోకి వచ్చిన విస్తీర్ణంలో 36 శాతం తెలంగాణదే**

**రాష్ట్రంలో ప్రస్తుతం 2.44 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు... 10 లక్షల ఎకరాలకు విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యం**

**వేంసూరు మండలం కల్లూరుగూడెం ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల**





**వేంసూరు, జూన్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్)** :ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఆగస్టు 15 నాటికి ప్రారంభించేలా అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు.శుక్రవారం వేంసూరు మండలం కల్లూరు గూడెంలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ఫ్యాక్టరీ నిర్మాణ పురోగతి, యంత్రాల ఏర్పాటు, మిగిలిన పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం 15.70 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు జరుగుతోందని తెలిపారు. దేశం వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే 70 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ ఆయిల్ పామ్ (ఎన్ఎంఈఓ-ఓపీ) పథకం క్రింద గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 6.82 లక్షల ఎకరాల్లో కొత్తగా ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, అందులో 2.44 లక్షల ఎకరాలు అంటే 36 శాతం తెలంగాణలోనే విస్తరించడం రాష్ట్రం సాధించిన గొప్ప విజయమని మంత్రి పేర్కొన్నారు. దేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణలో తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 79,448 మంది రైతులు 2.94 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని తెలిపారు. రానున్న రెండు మూడు సంవత్సరాల్లో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.గతంలో రాష్ట్రంలో కేవలం రెండు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు మాత్రమే ఉండేవని, రైతుల అవసరాలకు అనుగుణంగా కొత్త ఫ్యాక్టరీల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి సిద్దిపేటలో నూతన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించారని, ప్రస్తుతం కల్లూరుగూడెంలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం చివరి దశకు చేరుకుందని, ఆగస్టు15న ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు అనుగుణంగా ప్రతి జిల్లాలో ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో ఆయిల్ పామ్ గెలల ధర టన్నుకు రూ.12 వేలుగా ఉండేదని, ప్రభుత్వం చేసిన నిరంతర కృషి ఫలితంగా ప్రస్తుతం టన్నుకు రూ.23,852కు పెరిగిందని మంత్రి తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసంతో పాటు శ్రీరామచంద్రుని అనుగ్రహంతో ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే అవకాశం లభించిందన్నారు. జిల్లాలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులను కూడా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. బుగ్గపాడులో ప్రస్తుతం ఏర్పాటు అవుతున్న పరిశ్రమతో పాటు మరో రెండు మూడు నెలల్లో మరో రెండు మూడు పరిశ్రమలు కూడా వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని



పేర్కొన్నారు. అభివృద్ధి అన్ని రంగాల్లో ఖమ్మం జిల్లాను తెలంగాణలోనే నెంబర్ వన్ జిల్లాగా నిలపడం తన లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# పిసిడబ్ల్యూ న్యూస్ కథనానికి స్పందన



**- నాలుగు వారాలుగా ప్రారంభానికి నోచుకోని గ్రామ సంత కథనానికి స్పందించిన గ్రామ సర్పంచ్**

**- భారీ ఏర్పాట్లతో గ్రామ సంత ఏర్పాటు చేసిన సర్పంచ్ కవిత బాలకృష్ణ**

**- ప్రారంభానికి ముఖ్య అతిథులుగా కుందూరు సోమరం, కానాపురం సర్పంచులు**

**- మొదటి సంతలోనే బేరం కుదిరిన కాడి ఎడ్లు**











**తొర్రూరు ప్రతినిధి, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** తొర్రూరు మండలంలోనే కాకుండా చుట్టుపక్కల మండలాలలోనీ గ్రామాలలో ఏదో ఒక రోజు వారాంతపు సంతల కొనసాగుతూనే ఉన్నాయి. వారంలో ఆదివారం నుండి శనివారం వరకు గలవారాలలో శుక్రవారం ఏ గ్రామంలో కూడా వారసంత లేకపోవడంతో మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని గుర్తుర్ గ్రామపంచాయతీలో శుక్రవారం గ్రామ సంతను ఏర్పాటు చేయాలని గత నాలుగు వారాల క్రితం గ్రామ సభలో అందరి సమక్షంలో గ్రామ సంతను ఏర్పాటు చేస్తాను సభాముఖంగా తెలియపరిచారు. నాలుగు వారాలు గడిచినప్పటికీ కూడా వారసంతను గ్రామ సర్పంచ్ ప్రారంభించలేకపోయారు. వారసంత ప్రారంభమైతే గ్రామపంచాయతీకి కూడా కొంత ఆదాయం వచ్చి నిధులను కొంత పెంచుకునే అవకాశం ఉందని గ్రామ సర్పంచ్ వార్డులతో సహా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఏదో ఒక సాకుతో గ్రామసంతం మాత్రం ఏర్పాటు చేయలేకపోవడంతో గ్రామస్తులు కూడా నిరాశకు లోనయ్యారు. గ్రామంలో గ్రామ సంత నెలకొల్పటం సాధ్యంకాని విషయంగా మారిపోయిందని పి సి డబ్ల్యూ న్యూస్ లో కథనం వచ్చినా వెంటనే గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ స్పందిస్తూ గ్రామంలోని క్రీడా ప్రాంగణం మైదానంలో భారీ ఏర్పాట్లతో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సంత ప్రారంభోత్సవానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పక్క గ్రామపంచాయతీ సర్పంచులు కుందూరు సోమరం లింగమూర్తి, కానాపురం సర్పంచ్ మై పాషా కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామ సంతను రెండు నెలలుగా ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడానికి కారణం గుర్తురు గ్రామ సర్పంచ్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవితా బాలకృష్ణ ప్రసంగిస్తూ ప్రధాన రహదారులలో సంత ఏర్పాటు చేయడం ప్రతి ఒక్కరికి మేలు కలుగుతుందని గ్రామానికి 10 కిలోమీటర్ల దూరం అయిన తొర్రూర్ పట్టణం లోని సంతలో మంగళవారం గ్రామస్తులు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసుకుని రావడం కొంత ఇబ్బందులకు గురవుతున్నారని దానిని దృష్టిలో పెట్టుకొని సంతను ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ప్రతి శుక్రవారం గ్రామంలోని క్రీడా ప్రాంగణ మైదానంలో కూరగాయలతో పాటు పశువులు ,మేకలు కూడా ఈ సంతలో అమ్మకానికి వస్తాయని అన్నారు. సోమరం గ్రామ సర్పంచ్ ప్రసంగిస్తూ మండల కేంద్రంలోని తొర్రూర్ లోని వారాంతపు సంత చుట్టుపక్కల గ్రామాలకు దూరం కావడంతో గుర్తుర్ గ్రామ సర్పంచ్ నర్సంపేట ప్రధాన రహదారిలో గల ఈ గ్రామం పక్కనే అన్నారం షరీఫ్ దర్గా కూడా శుక్రవారం కావడంతో ఈ సంతకు అధికంగా అన్ని రకాలుగాకొనుగోలు చేసేందుకు అవకాశాలు ఉన్నాయని ప్రధాన రహదారి పక్కనే సంతన ఏర్పాటు చేయడంతో దారినవెళ్లేవారు కూడా కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని అన్నారు. సంత ఏర్పాటుచేసిన మొదటి రోజునని భారీగా కూరగాయలు నమ్మకం జరిగాయి. అలాగే మొదటిసారి వచ్చిన రైతుల కాడి ఎద్దులు తీసుకువచ్చిన రైతు జతకు 1,40,000 తెలుపగా 1,10,000 కు బేరం కుదరడంతో అందరూ ఆనంద వ్యక్తం చేశారు. ఈ సంత విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరు కూడా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామ సర్పంచ్ ప్రతి ఒక్కరిని తెలిసిన వారందరికీ ప్రచారం చేయాల్సిందిగా కోరారు. అనంతరం ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన సర్పంచ్ లకు సర్పంచ్ వార్డు మెంబర్లు శాలువాతో సన్మానించారు. దారిన వెళ్తున్న వాహనాలు కూడా ఆపుకొని సంతలో కూరగాయలు కొనుగోలు చేయడం విశేషం. ఈ సంత మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చెందాలని కోరుదాం. మొదటి రోజే గ్రామ సంతకు విశేష స్పందన రావడం ముఖ్య అతిథులుగా వచ్చిన వారికి ఎంతో ఆనందాన్ని కలిగించిందని అన్నారు.

# నేటి ఉదయం 9:30 ని.లకు గుర్తురు జిపిలో బాల సభ ఏర్పాటు

**• బాలల స్నేహపూర్వక గ్రామాన్ని నిర్మిద్దాం**



**తొర్రూరు ప్రతినిధి, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తోరూర్ మండలంలోని గుర్తులు గ్రామపంచాయతీలో గల ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు బాలసభ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఏర్పాటు చేశారు.పిల్లలే దేశ భవిష్యత్తుకు పునాది. వారి విద్య, ఆరోగ్యం, భద్రత మరియు సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి గ్రామం బాలల స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలి. ఈ లక్ష్యంతో గుర్తూరు గ్రామపంచాయతీ బాలల అవసరాలు, సమస్యలు మరియు సూచనలను గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా చేర్చి, వారి హక్కులు మరియు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సంకల్పించింది.గ్రామంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన వాతావరణం, సురక్షితమైన ఆటస్థలాలు, ఆరోగ్య సేవలు మరియు సమాన అవకాశాలు అందేలా చర్యలు చేపడదాం. బాలల అభిప్రాయాలను గౌరవించి, వారి భవిష్యత్తు కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం మన అందరి బాధ్యత.**బాలల అవసరాలు గ్రామాభివృద్ధి ప్రణాళికలో చేరుద్దాం, బాలల హక్కులు మనందరం కాపాడుదాం.**బాలల అభివృద్ధికి అనుకూలమైన, సురక్షితమైన మరియు ఆదర్శ గ్రామంగా గుర్తూరును తీర్చిదిద్దేందుకు గాను నేటి ఉదయం 9:30 నిమిషాలకు గ్రామ పంచాయతీ ఆవరణం లో గ్రామ సర్పంచ్ విస్సంపల్లి కవిత బాలకృష్ణ అధ్యక్షతన బాల సభ ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగింది.. గ్రామ పాలక వర్గ సభ్యులు, గ్రామ పంచాయతి పరిధిలో గల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,టీచర్లు, అంగన్వాడీ టీచర్లు,మెడికల్ ఆఫీసర్,ఆశ, ఏఎన్ఎం గ్రామపంచాయతీ పరిధిలోగల బాల బాలికలు, వారి తల్లిదండ్రులు మరియు ప్రజలందరూ హాజరు కావాలని కోరుతున్నాము అని అన్నారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ తో పాటు గ్రామ కార్యదర్శి సుధాకర్ వెల్లడించారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు

**- చీకటాయపాలెం టీచర్స్ అసోసియేషన్ టీచ్ ఆధ్వర్యంలో**






**తొర్రూరు ప్రతినిధి, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తోరూర్ మండలంలోని చీకటాయపాలెం గ్రామంలో చీకటయపాలెం టీచర్స్ అసోసియేషన్ టీచ్ ఆధ్వర్యంలో 2025-2026 విద్య సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలో చదివిన పదవ తరగతి ఫలితాల్లో చీకటాయపాలెం గ్రామం నుండిపదవ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను,నీట్ లో ర్యాంకు సాధించిన ఎం . బి.బి ఎస్ విద్యార్థులను టీచ్ అధ్యక్షులు పల్లె యాకమల్లయ్య అధ్యక్షతన ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ చిదురాల కృష్ణమూర్తి ఉప సర్పంచ్ పొడుపుకంటి సరస్వతి శేఖర్ , యు.పి.ఎస్ చీకటయపాలెం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ టీచ్ అధ్యక్షులు ఎస్.రాములు ప్రధాన కార్యదర్శి కొండ యాకయ్య కోశాధికారి బి.యాకన్న , నగదు ప్రోత్సాహక దాత మరియు టీచ్ సభ్యులు పల్లె మదన్ మోహన్ టీచ్ సీనియర్ సభ్యులు పులి ముత్తిలింగం , ఎం.డి యాకుబ్ పాషా ,బి..యాక మధు పి.అనిల్, ఎం.శోభ పాల్గొని నీట్ లో ఉత్తమ ర్యాంక్ పొంది ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎం.బి.బిఎస్ సీటు సాధించిన మహమ్మద్ సానియా , పులి సాయి మన్విత మరియు 2025-2026 విద్య సంవత్సరం పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వేల్పుగొండ ఐశ్వర్య, ఉడుత ఐశ్వర్య, పాండవుల జస్వంత్ ను సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచి ఉప సర్పంచ్ ప్రసంగిస్తూ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్యా ద్వారా ఏదైనా సాధించవచ్చు మరియు మా పదవి బాధ్యల ఉన్నప్పుడు మన గ్రామంలో ఇటువంటి కార్యక్రమం చేయడం చాలా సంతోషకరమైనది మరియు టీచ్ కు అభినందనలు తెలియజేసినారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈ గ్రామంలో ఉన్న విద్యార్థిని విద్యార్థులు కూడా మీ గ్రామ టీచర్లను ఆదర్శంగా తీసుకొని మీరు కూడా ఉన్నతమైన స్థానంలో ఉండాలని మరియు ఈ రోజుల్లో ఎవరి స్వార్థం వారు చూసుకుంటున్న మరియు వ్యక్తిగత జీవితంలో చాలా బిజీగా ఉన్నా కూడా ఇటువంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం మరియు ఒక గ్రామ పౌరునిగా గ్రామం గురించి ఆలోచించి ఈ గ్రామ విద్యార్థులకు మార్గదర్శకంగా ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమం చేయడం టీచ్ సభ్యులను అభినందించినారు. టీచ్ సభ్యులు ప్రసంగిస్తూ ఇక్కడ ఈ సమావేశంలో మీ ముందు ఉన్న టీచర్లమందరం కూడా ఈ గ్రామం నుండి పుట్టి, పెరిగిన వారు మేమందరం కూడా చిన్నతనంలో బాగా కష్టపడి చదివి ఆర్థిక సమస్యలను ఎదుర్కొని ఈ ఉన్నతమైన వృత్తి లోకి రావడం జరిగింది మీరు కూడా చిన్న చిన్నప్పటి నుండి పాఠశాలలో చెప్పిన పాఠ్యాంశాలను చదివి సాధన చేసి పై తరగతులు చదివి మీరు భవిష్యత్తులో మంచి ఉన్నతమైన స్థానంలో ఉండాలని అది కూడా విద్య ద్వారానే సాధ్యమైతుందని దీన్ని మార్గదర్శకత్వం తీసుకోవాలని విద్యార్థులను కోరడం జరిగింది. అదేవిధంగా పిల్లల తల్లిదండ్రులు కూడా మీ పిల్లల్ని మీరు కష్టపడుతూ పిల్లల్ని చదివించి మంచి మార్గంలో నైతిక విలువలతో కూడిన పెంపకాన్ని అందించవలసిందిగా తల్లిదండ్రులకు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ విద్యావంతులు, యువకులు, విద్యార్థిని విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 12వ డివిజన్ రామచంద్రాపూర్ కాలనీ పెద్దమ్మ దేవాలయంలో మినీ హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్







**కరీంనగర్ జిల్లా జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 12వ డివిజన్ రామచంద్రాపూర్ కాలనీలోని పెద్దమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన మినీ హైమాస్ట్ లైట్లను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. దేవాలయాలు, కాలనీలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో మెరుగైన వెలుతురు ఉండేలా మినీ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ లైట్ల ఏర్పాటు ద్వారా రాత్రి వేళల్లో భక్తులు, స్థానిక ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణంతో పాటు భద్రత కూడా మెరుగుపడుతుందని అన్నారు. డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘం పెద్దలు, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.


# యాస్వాడలో ఇందిరమ్మ ఇల్లు భూమిపూజ



**మానకొండూర్ జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** గన్నేరువరం మండలం యాస్వాడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన నాలుగు ఇళ్లలో ఒకటైన మామిడిపల్లి పద్మలక్ష్మణ్ దంపతుల ఇంటి నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కటకం తిరుపతి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గువ్వల సత్యం, మండల కంప్యూటర్ ఆపరేటర్ సాయి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మామిడిపల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు అవుతుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రాపాక ప్రవీణ్ నియామకం

**- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**



**కరీంనగర్ , జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కరీంనగర్ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రాపాక ప్రవీణ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అధికారిక నియామక ఉత్తర్వులను జారీ చేశారు. రాపాక ప్రవీణ్ గతంతో మానకొండూర్ మండల అధ్యక్షునీగా పనిచేశారు. ప్రస్తుతం మానకొండూరు మండలం లక్ష్మీపూర్ ఉప సర్పంచ్ గా, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ అడ్వైజరీ ప్యానెల్ మెంబర్ హోదాలో కొనసాగుతున్నారు. ఎస్సీ వర్గాల సమస్యలకోసం, జిల్లాలో ఎస్సీ మోర్చా విభాగం మరింత బలోపేతం చేయడానికి, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని రాపాక ప్రవీణ్ ఈ సందర్భంగా తెలిపారు. , పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, జిల్లాలో ఎస్సీ మోర్చాను అత్యంత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని, . తన నియామనకానికి సహకరించిన కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు అందరికీ ధన్య వాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు..


# విహారయాత్ర పుణ్యక్షేత్రాలు దర్శించుకుని అవకాశాన్ని అందరూ వినియోగించుకోండి

**- అయోధ్య కాశీ పుణ్యక్షేత్ర యాత్ర**

**తొర్రూరు ప్రతినిధి, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** విహారయాత్రలకు వెళ్లాలని ప్రతి ఒక్కరికి కూడా కోరిక ఉంటుంది. కొన్ని సమయాలలో వెళ్లలేక సదుపాయాలు లేక ఎలా వెళ్లాలో తెలియక ఆలోచన చేస్తూ ఉంటారు. ఎలాంటి చింత లేకుండా వరంగల్ రీజినల్ లోని తొర్రూర్ టీజీఎస్ ఆర్టీసీ బస్టాండ్ నుండి భక్తుల సౌకర్యార్థం తొర్రూర్ డిపో ఆధ్వర్యంలో 8 రోజుల ప్రత్యేక పుణ్యక్షేత్ర యాత్రను నిర్వహించనున్నట్లు డిపో అధికారులు తెలిపారు. యాత్ర ప్రారంభం: 02 జూలై రాత్రి 8:00 గంటలకు తొర్రూర్ నుండి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుంది. యాత్ర ముగింపు: 10 జూలై రాత్రి తొర్రూర్‌కు బస్సు చేరుకొని ఉన్నదని అన్నారు. ప్రయాణ చార్జీ: ఒక్కొక్కరికి ₹9,000/– మాత్రమే. గమనిక: ఆహారం మరియు వసతి ఖర్చులు ప్రయాణికుల స్వంత బాధ్యత. దర్శించు పుణ్యక్షేత్రాలు: పూరి, శ్రీ జగన్నాథ స్వామి దేవాలయంకోణార్క్ సూర్య దేవాలయం, గయా, విష్ణుపద దేవాలయం, వారణాసి, శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయం మరియుకారిడార్‌కాశీ విశాలాక్షి అమ్మవారి దేవాలయం, అన్నపూర్ణ దేవి ఆలయంసాయంత్రం గంగా హారతి అయోధ్య, శ్రీరామ జన్మభూమిహనుమాన్ గర్హిసరయూ నది హారతి. ప్రయాగరాజ్. త్రివేణి సంగమం అక్కడే నువ్వు తిరుగు ప్రయాణం.




# నూతన వధూవరులను ఆశీర్వదించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కొండగట్టు జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం సూపరింటెండెంట్ ఉపాధ్యాయుల కరుణశ్రీ చంద్రశేఖర్ దంపతుల కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో కొనసాగాలని ఆకాంక్షించారు. వివాహ రిసెప్షన్‌కు హాజరైన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆహ్వానితులతో కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆప్యాయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, అభిమానులు కూడా పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఎలాంటి పక్షపాతం లేకుండా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**







**చిట్యాల జూన్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సి) గ్రామ పరిధిలో నూతనంగా నిర్మించిన రెండు ఇందిరమ్మ గృహాలను భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో నాలుగున్నర లక్షల ఇండ్లను. నియోజకవర్గానికి 3500 చొప్పున పేదలకు ఇందిరమ్మ ఇండ్లను కట్టి ఇవ్వడం జరుగుతుందని అన్నారు నిరుపేదలకు ఎలాంటి పక్షపాతం లేకుండా పూరిగుడిసె వేసుకొని నివసిస్తున్న వారికే ఒక రూపాయి లంచం లేకుండా వారి అకౌంట్లో నేరుగా బేస్మెంట్ కడితే లక్ష. స్లాబ్ లెవల్ కడితే రెండు లక్షలు. స్లాబు వేసుకుంటే 4 లక్షలు. ఇల్లు పూర్తి చేసుకుంటే 5 లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని ఇది ఒక పారదర్శకంగా పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఈ రాష్ట్ర ప్రభుత్వము గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని. గత ప్రభుత్వం పది 10 సంవత్సరాల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించిన రెండువేల ఇండ్లు ఉన్నాయి అని వాటిని కూడా పూర్తి చేసి ఇవ్వడం జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తగు ఆదేశాలు హౌసింగ్ అధికారులకు మరియు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు.

# బీఎల్ఓతో కార్పొరేటర్ భర్త వాగ్వాదం.. 34వ డివిజన్‌లో ఉద్రిక్తత



**కరీంనగర్ జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని 34వ డివిజన్ పరిధిలో గురువారం ఓటరు నమోదు ప్రక్రియ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పీఎస్–234 పరిధిలో విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓ స్థానిక ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తుండగా, 34వ డివిజన్ కార్పొరేటర్ భర్త అక్కడికి చేరుకుని బీఎల్ఓతో వాగ్వాదానికి దిగినట్లు స్థానికులు తెలిపారు. బీఎల్ఓ మాజీ కార్పొరేటర్ ఇంటి ముందు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆయన ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనతో అక్కడ ఉన్న స్థానిక ప్రజలు, ఇతర బీఎల్ఓలు భయాందోళనకు గురయ్యారు. ఘటనపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ, ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులను ఎలాంటి ఆటంకాలు లేకుండా తమ బాధ్యతలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# కుంకుడుపాముల గ్రామంలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం

**రామన్నపేట జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండటం బాధ్యత అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కుంకుడుపాముల సర్పంచ్ గొలుసుల సత్తయ్య యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం గ్రామంలో ఇంటి ఇంటికి తిరిగి ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన గొప్ప ఆయుధమని, భవిష్యత్తులో మంచి నాయకులను ఎన్నుకోవడానికి ప్రతి పౌరుడు తన పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. బిఎల్ఓ (బూత్ లెవెల్ ఆఫీసర్) , ఓటరు నమోదు ప్రక్రియ గురించి గ్రామస్థులకు వివరించారు.



# కరీంనగర్ పాతబజార్‌లో మొహర్రం వేడుకలు

**● పీరీలను దర్శించుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** మొహర్రం పండుగ సందర్భంగా కరీంనగర్ నగరంలోని పాతబజార్‌లో ఏర్పాటు చేసిన పీరీలను రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మొహర్రం శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వానికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మంత్రి వెంట సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని పీరీలను దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు, ముస్లిం పెద్దలు మంత్రికి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మత పెద్దలు, అధికారులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మొహర్రం వేడుకలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

# మంత్రి శ్రీధర్ బాబుపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించం: కాంగ్రెస్ నేతలు



**కరీంనగర్ జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** మంత్రి శ్రీధర్ బాబుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మండిపడ్డారు. మంత్రి శ్రీధర్ బాబు నిజాయితీపై రాష్ట్ర ప్రజలకు పూర్తి నమ్మకం ఉందని, రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని వారు సూచించారు. మంత్రి శ్రీధర్ బాబుపై అవినీతి ఆరోపణలు రుజువు చేస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు రాష్ట్రాన్ని భారీ అప్పుల ఊబిలోకి నెట్టారని, దళిత బంధు పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయకుండా హుజూరాబాద్‌కే పరిమితం చేశారని విమర్శించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టే బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతికి నిదర్శనమని ఆరోపించారు. ఇసుక మాఫియాకు పుట్ట మధు బ్రాండ్ అంబాసిడర్‌లా వ్యవహరించారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ముందుగా ఆత్మవిమర్శ చేసుకోవాలని, మంత్రి శ్రీధర్ బాబు నిజాయితీ, పారదర్శకత గురించి రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబుపై ఆధారాలు లేకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని, ప్రజా సమస్యలపై చర్చించాలే గానీ రాజకీయ దుష్ప్రచారాలకు పాల్పడవద్దని కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నేతలకు సూచించారు.

# చరిత్ర సృష్టించిన శ్రీచరణి

టీమిండియా స్పిన్నర్, తెలుగు తేజం శ్రీచరణి చరిత్ర సృష్టించింది. ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే సింగిల్ ఎడిషన్‌లో అత్యధిక వికెట్లు తీసిన తొలి ఆసియా ప్లేయర్‌గా నిలిచింది. ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో 4 మ్యాచ్‌ల్లో 12 వికెట్లు తీయడం ద్వారా శ్రీ చరణి ఈ ఫీట్ సాధించింది. ఈ టోర్నీలో భాగంగా బుధవారం బంగ్లాదేశ్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో శ్రీచరణి రెండు వికెట్లు పడగొట్టింది. ఈ రెండు వికెట్లను ఆఖరి ఓవర్‌లో సాధించింది. ఆమె బౌలింగ్‌లో ధాటిగా ఆడబోయిన షోర్నా అక్తెర్, నహిదా అక్తెర్ వికెట్ పారేసుకున్నాడు. అంతకుముందు సౌతాఫ్రికా, పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌ల్లో మూడు వికెట్ల ఘనతను అందుకుంది. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో నాలుగు వికెట్లు పడగొట్టింది. ఈ టోర్నీలో రెడ్ హాట్ ఫామ్‌లో ఉన్న శ్రీచరణి మొత్తం 12 వికెట్లతో సింగిల్ ఎడిషన్ టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన తొలి ఆసియా ప్లేయర్‌గా నిలిచింది. 17 ఏళ్ల మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే మరే ప్లేయర్ కూడా ఈ ఫీట్ సాధించలేదు. ఈ క్రమంలో ఆమె భారత బౌలర్ పూనమ్ యాదవ్ రికార్డ్‌ను అధిగమించింది. 2020 మహిళల టీ20 ప్రపంచకప్‌లో పూనమ్ యాదవ్ 10 వికెట్లు తీసింది. ఈ జాబితాలో దయానా దేవిడ్(9-2010), పూనమ్ యాదవ్(8-2014), పూనమ్ యాదవ్(8-2018), రాధా యాదవ్(8-2018), ఫాతిమా సనా(8-2026) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.



అంతేకాకుండా సింగిల్ ఎడిషన్ టీ20 ప్రపంచకప్‌లో వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో రెండు, అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన తొలి ఆసియా ప్లేయర్‌గా కూడా శ్రీచరణి నిలిచింది. పూనమ్ యాదవ్(2014, 2018), రాధా యాదవ్(2018), రేణుకా ఠాకూర్(2024) ఈ ఫీట్ సాధించారు. పాకిస్థాన్ ప్లేయర్ అలియా రియాజ్(2018), ఫతిమా సనా(2026), సాదికా ఇక్బాల్(2026) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. గతేడాది మహిళల వన్డే ప్రపంచకప్‌లోనూ 9 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు పడగొట్టి భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. శ్రీచరణి(2/21) అద్భుత ప్రదర్శనతో పాటు షెఫాలీ వర్మ(34 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 53) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగడంతో బంగ్లాదేశ్‌పై భారత్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 136 పరుగులే చేసింది. జుయారియా ఫెర్డోస్(31 బంతుల్లో 5 ఫోర్లతో 33), నిగర్ సుల్తానా(27 బంతుల్లో 4 ఫోర్లతో 32), సోభనా మోస్ట్రే(26 బంతుల్లో 2 ఫోర్లతో 22) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో రాధా యాదవ్(3/28) మూడు వికెట్లు తీయగా.. రేణుకా సింగ్, నందని శర్మ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం భారత్ 16.5 ఓవర్లలో 5 వికెట్లకు 139 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. షెఫాలీ వర్మతో పాటు యస్తికా భాటియా(18 బంతుల్లో 3 ఫోర్లతో 23), జెమీమా రోడ్రిగ్స్(15 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 26) విలువైన పరుగులు చేశారు. బంగ్లాదేశ్ బౌలర్లలో రితూ మోనీ రెండు వికెట్లు తీయగా.. మరుఫా అక్తెర్, రాబేయా ఖాన్, నహిదా అక్తర్ తలో వికెట్ తీసారు. నాలుగు మ్యాచ్‌ల్లో 3 విజయాలతో టీమిండియా గ్రూప్-1లో రెండో స్థానంలో కొనసాగుతోంది.

# తొలి ప్రాక్టీస్ సెషన్‌లో వైభవ్ సూర్యవంశీకి చేదు అనుభవం



బెల్ఫాస్ట్ చేరుకున్న భారత ఆటగాళ్లకు ఇక్కడి ప్రాక్టీస్ స్టేడియంలో సరైన మౌలిక వసతులు కల్పించకపోవడంతో టీమ్ మేనేజ్‌మెంట్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. భారత ఆటగాళ్లు ప్రాక్టీస్ చేయడానికి కేటాయించిన ఒక పిచ్ వెనుక 'సైట్‌స్క్రీన్' లేకపోవడాన్ని మేనేజ్‌మెంట్ గుర్తించింది. బౌలర్ చేతి నుంచి వచ్చే బంతి బ్యాటర్‌కు స్పష్టంగా కనిపించాలంటే సైట్‌స్క్రీన్ తప్పనిసరి. అది లేకపోవడంతో ఇషాన్ కిషన్ వంటి సీనియర్ బ్యాటర్లతో పాటు ఇతర ఆటగాళ్లు కూడా బంతిని సరిగ్గా అంచనా వేయడానికి ఇబ్బంది పడ్డారు. దీనిపై భారత జట్టు ఆపరేషన్స్ మేనేజర్ వెంటనే స్పందించి, క్రికెట్ ఐర్లాండ్ అధికారులతో మాట్లాడి నిరసన వ్యక్తం చేశారు. దీంతో అప్రమత్తమైన స్థానిక నిర్వాహకులు ప్రాక్టీస్ సెషన్ వేగం పుంజుకోకముందే ఆ లోపాన్ని సరిదిద్దారు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి ఇది టీమిండియాతో తొలి ట్రైనింగ్ సెషన్ కాగా.. సైట్ స్క్రీన్ కారణంగా అతడికి ఒక చేదు అనుభవంగా మారింది. ఈ గందరగోళం సర్దుమణిగిన తర్వాత, అందరి దృష్టి 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపైనే నిలిచింది. సీనియర్ జాతీయ జట్టుతో తన కెరీర్‌లో మొట్టమొదటి నెట్ సెషన్‌లో పాల్గొన్న వైభవ్, తనపై ఉన్న భారీ అంచనాల ఒత్తిడిని ఏమాత్రం దరిచేరనివ్వలేదు. ఎడమచేతి వాటం కలిగిన ఈ కుర్రాడు నెట్స్‌లో అత్యంత ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేస్తూ, మైదానం నలుమూలలా క్లాసిక్ డ్రైవ్‌లు, తన మార్క్ అటాకింగ్ షాట్లతో అలరించాడు. పిచ్‌పై బౌన్స్ హెచ్చుతగ్గులుగా ఉన్నప్పటికీ సూర్యవంశీ సులువుగా సిక్సర్లు బాదడం విశేషం. సాధారణంగా క్రికెట్ హడావుడి పెద్దగా లేని బెల్ఫాస్ట్ నగరంలో వైభవ్ రాకతో ఒక్కసారిగా సందడి నెలకొంది. భారత సంతతికి చెందిన ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో స్టేడియానికి తరలివచ్చారు. నెట్స్ ముగిసిన తర్వాత వైభవ్‌తో సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌ల కోసం అభిమానులు ఎగబడ్డారు. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ వైభవ్‌కు సంరక్షకుడిగా నియమించిన రోమి భిందర్‌తో పాటు, వైభవ్ తల్లిదండ్రులు కూడా ఈ పర్యటనలో జట్టుతో పాటే ఉన్నారు. సరికొత్త టీ20 శకంలో అడుగుపెడుతున్న భారత్, ఈ మ్యాచ్‌లో వైభవ్‌కు తుది జట్టులో అవకాశం ఇచ్చి చరిత్ర సృష్టిస్తుందా.. లేదా ఇషాన్ కిషన్, సంజూ శాంసన్ వంటి సీనియర్లతోనే బరిలోకి దిగుతుందా అనేది కొన్ని గంటల్లో తేలనుంది.

# నా లైఫ్‌లో చూసిన అత్యుత్తమ బ్యాటర్ కోహ్లీ

**- సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్**



సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ ఒక ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. తన దృష్టిలో ప్రపంచపు అత్యుత్తమ టాప్ 3 బ్యాటర్లు ఎవరో వెల్లడించాడు. పైగా అందులో నంబర్ వన్ ప్లేస్‌లో మన టీమిండియా దిగ్గజ క్రికెటర్ ఉండటం విశేషం. ఇంతకీ డివిలియర్స్ ఎవర్ని అత్యుత్తమ బ్యాటర్లుగా పేర్కొన్నాడో ఇప్పుడు తెలుసుకుందాం.. భారత స్టార్ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ తన జీవితంలో చూసిన అత్యుత్తమ బ్యాటర్ అని ఏబీ డివిలియన్స్ అన్నాడు. ముఖ్యంగా ఒత్తిడితో కూడిన రన్ ఛేజ్‌లలో కోహ్లీ ప్రదర్శించే సంయమనం, టార్గెట్‌ని చేరుకునే స్కిల్, ఇన్నింగ్స్‌ను నియంత్రించే సామర్థ్యం అసాధారణమని కొనియాడాడు.ఒక ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మాట్లాడుతూ.. "నా జీవితంలో నేను చూసిన అత్యుత్తమ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ. అతని తర్వాతే రికీ పాంటింగ్, కుమార సంగక్కర వంటి దిగ్గజాలు వస్తారు" అని డివిలియర్స్ పేర్కొన్నాడు. కోహ్లీ ఆటలో కనిపించే నిలకడ, ఫిట్‌నెస్, మానసిక దృఢత్వం అతడిని ప్రత్యేక ఆటగాడిగా నిలబెట్టాయని చెప్పాడు. వన్డే క్రికెట్‌లో ఛేజింగ్ విషయానికి వస్తే కోహ్లీకి సాటే లేదని డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు. భారీ లక్ష్యాలను ఛేదించే సమయంలోనూ ఒత్తిడిని అధిగమించి జట్టును విజయతీరాలకు చేర్చే సామర్థ్యం కోహ్లీని ప్రపంచంలోనే అత్యుత్తమ ఛేజ్ మాస్టర్‌గా నిలబెట్టిందని పేర్కొన్నాడు.

# మాజీ కోచ్ మనుకు 35 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

క్రికెట్ ట్రైనింగ్ వచ్చిన మైనర్ బాలికను లైంగికంగా వేధించిన కేసులో కేరళ క్రికెట్ అసోసియేషన్ మాజీ కోచ్ మనుకు 35 ఏళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. ఈ మేరకు తిరువనంతపురం పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. తిరువనంతపురంలోని శ్రీవరగం ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల క్రికెట్ కోచ్ మనుపై మొత్తం 6 పోక్సో కేసులు నమోదయ్యాయి. తన అకాడమీకి వచ్చిన చిన్నారులను లైంగికంగా వేధించాడనే అభియోగాలతో పోలీసులు ఈ కేసులు పెట్టారు.ఇందులోని రెండో కేసును విచారించిన తిరువనంతపురం ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అంజు మీరా బిర్లా.. నిందితుడు మనుకు 35 ఏళ్ల కఠిన కారాగా శిక్షతో పాటు రూ.66,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే మరో 6 ఏళ్ల 9 నెలలు జైలులో గడపాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.ఈ కేసు వివరాల ప్రకారం ఓ బాధితురాలు 2018లో మను అకాడమీలో చేరింది. ఆ మైనర్ బాలికకు ప్రత్యేక ఫిట్‌నెస్ ట్రైనింగ్ ఇస్తానన్న నెపంతో జిమ్, బాత్రూమ్‌కు తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. అంతేకాకుండా రహస్యంగా ఆ బాలిక ఫొటోలు, వీడియోలు కూడా తీసాడు. ఒకవేళ ఆ విషయాన్ని బయటపెడితే ఆమె క్రికెట్ భవిష్యత్తును నాశనం చేస్తానని బెదిరించాడు. భయపడిన ఆ బాలిక 2019లో అకాడమీని విడిచిపెట్టింది. ఏళ్లు గడిచినా ఆ చిన్నారులు భయంతో మౌనంగా ఉండిపోయారు. ఈ పరిస్థితుల్లో తిరువనంతపురం వేదికగా జరిగిన మహిళల క్రికెట్ మ్యాచ్ సందర్భంగా కోచ్ మనును మళ్లీ చూసిన బాధిత విద్యార్థి భయంతో గట్టిగా ఏడ్చేసింది. ఆ తర్వాత జరిగిన విచారణలో మను లైంగిక వేధింపులకు పాల్పడిన విషయం వెలుగులోకి వచ్చింది.

# నల్గొండ నైట్స్ వరుసగా రెండో విజయం

టీజీ20 లీగ్‌లో అనురాగ్ నల్గొండ నైట్స్ వరుసగా రెండో విజయం నమోదు చేసింది. తాజాగా వరంగల్ వారియర్స్‌తో మ్యాచ్‌లో నల్గొండ 91 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. నల్గొండ నిర్దేశించిన 260 పరుగుల భారీ ఛేదనలో వరంగల్ తేలిపోయింది. 14 ఓవర్లలో 168 రన్స్‌కే ఆలౌట్ అయ్యింది. కెప్టెన్ పేరాల అమన్‌రావు (46 పరుగులు, 15 బంతుల్లో), మురుగన్ అభిషేక్ (44 పరుగులు) మాత్రమే చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడారు. నల్గొండ బౌలర్లలో నిషాంత్, వరుణ్ గౌడ్ చెరో 3, అనికేత్ రెడ్డి 2, అర్ఫాజ్, దివేశ్ సింగ్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. భారీ ఛేదనలో మూడో ఓవర్లోనే రెండు వికెట్లు తీలసి వరంగల్‌ను నల్గొండ కష్టాల్లోకి నెట్టింది. 2.3 ఓవర్ వద్ద హర్షిత్ చౌదరి (10) ఔట్ కాగా, ఆ తర్వాత బంతికే రిషికేత్ సిసోదియా (0)ను నిషాంత్ పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత కెప్టెన్ పేరాల అమన్‌రావు (46 పరుగులు, 15 బంతుల్లో), మురుగన్ అభిషేక్ (31 పరుగులు) చెలరేగడంతో నాలుగు ఓవర్లకే వరంగల్ 70 రన్స్ చేసింది. దీంతో గాడిలో పడ్డట్లే అనిపించింది. కానీ ఐదో ఓవర్లో అమన్ రావు ఔటయ్యాడు. 6.6 ఓవర్ వద్ద భవేష్ సేత్ (22)ను దివేశ్ ఔట్ చేశాడు. కాసేపటికే 9.4 వద్ద మణి కిరణ్ (16) స్వల్ప స్కోర్‌కే ఔటయ్యాడు. దీంతో 10 ఓవర్లలోపే వరంగల్ 5 కీలక వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత వికెట్ల పతనం కొనసాగింది. 11వ ఓవర్లో అభిషేక్ ఔట్ అవ్వడంతో వరంగల్ ఓటమి దాదాపు ఖాయమైంది. 13వ ఓవర్లో కులకర్ణి, మన్సూరి పెవిలియన్ చేరగా, 14వ ఓవర్లో రెండో బంతికి హుస్సేన్, ఆరో బంతికి క్రాంతి ఔటయ్యారు. దీంతో వరంగల్ ఇన్నింగ్స్ ముగిసింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన నల్గొండ నైట్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసింది. గౌరవ్ రెడ్డి (80 పరుగులు), పాట్కూరి నితీశ్ రెడ్డి (84 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. చివర్లో అర్ఫాజ్ అహ్మద్ (33 పరుగులు, 14 బంతుల్లో), దివేశ్ సింగ్ (18 పరుగులు) మెరుపులు మెరిపించారు. దీంతో నల్గొండ స్కోర్ 250 పరుగులు దాటింది. వరంగల్ బౌలర్లలో మహ్మద్ మాలిక్ 2, ముదాసర్ హుస్సేన్, కులకర్ణి తలో 1 వికెట్ పడగొట్టారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన నల్గొండకు తొలి ఓవర్ ఐదో బంతికే షాక్ తగిలింది. ఓపెనర్ ప్రణవ్‌ను మహ్మద్ మాలిక్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో 7రన్స్‌కే 1 వికెట్ పడింది. అయితే వన్ డౌన్‌లో వచ్చిన నితీశ్ రెడ్డితో కలిసి గౌరవ్ విధ్వంసం సృష్టించాడు. ఈ ఇద్దరూ పోటీపడి మరీ బౌండరీలు బాదేశారు. ఈ క్రమంలోనే అర్ధ శతకాలు పూర్తి చేశారు. రెండో వికెట్‌కు ఈ జోడీ 65 బంతుల్లోనే 142 పరుగులు జోడించింది. 11.4 ఓవర్ వద్ద గౌరవ్‌ను ముదాసిర్ ఔట్ చేయగా, 15.1 వద్ద నితీశ్ రనౌట్ అయ్యాడు. అలా ఇద్దరు సెట్ బ్యాటర్లు సెంచరీలు మిస్ చేసుకున్నారు. ఇక చివర్లో రాహుల్ (31 పరుగులు, 18 బంతుల్లో) అర్ఫాజ్ చెలరేగి ఆడారు. వీళ్ల విధ్వంసానికి దివేశ్ సింగ్ మెరుపులు తోడవ్వడంతో జట్టు స్కోర్ 250 పరుగులు దాటింది. కాగా, ఇప్పటిదాకా మూడు మ్యాచ్‌లు ఆడిన నల్గొండకు ఇది రెండో విజయం. దీంతో పట్టిక (4 పాయింట్లు)లో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. మూడు మ్యాచ్‌లు ఆడిన వరంగల్‌కు ఇది రెండో ఓటమి. ఇక ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ టీమ్ 4 పాయింట్లతో రెండో స్థానంలోఅన్నే పాయింట్లున్న రంగారెడ్డి మూడో ప్లేస్‌లో ఉన్నాయి. టాప్ 3 జట్లు 4 పాయింట్లతోనే ఉన్నా రన్‌రేట్ ఆధారంగా ఆయా ప్లేస్‌ల్లో ఉన్నాయి.



# ఆస్ట్రేలియాను మరోసారి ఓడిస్తాం

**టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ధీమా**

ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ 2026 టోర్నీ తరహాలోనే ఆస్ట్రేలియాను మరోసారి ఓడిస్తామని టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ధీమా వ్యక్తం చేసింది. ఆసీస్‌ను ఓడిస్తే తమ ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుందని చెప్పుకొచ్చింది. ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా బంగ్లాదేశ్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో సెమీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో పటిష్టమైన ఆస్ట్రేలియాతో తలపడాల్సి ఉంది. బంగ్లాదేశ్‌తో విజయానంతరం మాట్లాడిన హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ గెలుపుపై సంతోషం వ్యక్తం చేసింది. 'ఇది ఒక మంచి విజయం. మేం ఈ మ్యాచ్‌ను ఇంకాస్త ముందుగానే ముగించాల్సింది. అయినప్పటికీ 2-3 ఓవర్ల ఉండగానే విజయాన్ని అందుకోవడం చాలా మంచి విషయమే. మేం మా ఫీల్డింగ్‌పై చాలా శ్రమించాం. అయినా ఈ మ్యాచ్‌లో కొన్ని క్యాచ్‌లు చేజార్చాం. వచ్చే మ్యాచ్‌లో మా అత్యుత్తమ ప్రదర్శనను చూపిస్తామని ఆశిస్తున్నాను. క్యాచ్‌లు వదిలిన ఆటగాళ్లు మా జట్టులోనే అత్యుత్తమ ఫీల్డర్లు, కానీ కొన్నిసార్లు ఇలా జరుగుతూ ఉంటుంది. నిరంతరం శ్రమిస్తూ.. క్యాచ్‌లు పడుతూ ఉంటే మైదానంలో సరైన పొజిషన్లలో ఉండగలం. ఈ మ్యాచ్‌లో మేం కొన్ని తప్పులు చేశాం. కానీ తదుపరి మ్యాచ్‌లో మా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తామని ఆశిస్తున్నాను.ఇక ఆస్ట్రేలియాతో తలపడడానికి మేం పూర్తిగా సిద్ధంగా ఉన్నాం. వారు మా అత్యుత్తమ ప్రత్యర్థుల్లో ఒకరు. ఇలాంటి టోర్నమెంట్‌లలో ప్రతి మ్యాచ్ తప్పక గెలవాల్సిన పరిస్థితి ఉన్నప్పుడు.. మన అత్యుత్తమ ప్రదర్శనను బయటకు తీయాలి. ఒకవేళ ఆస్ట్రేలియాపై మేం గెలిస్తే.. మాకు చాలా ఆత్మవిశ్వాసం వస్తుంది. గతంలో నవీ ముంబైలో సాధించిన విజయం మాకు ఎంతో నమ్మకాన్ని ఇవ్వడమే కాకుండా, మాకున్న కొన్ని అడ్డంకులను బద్దలు కొట్టింది.'అని వన్డే ప్రపంచకప్ విజయాన్ని హర్మన్‌ప్రీత్ కౌర్ గుర్తు చేసుకుంది. గతేడాది జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్-2లో టీమిండియా అద్వితీయమైన ప్రదర్శనతో చిరస్మరణీయమైన విజయాన్నిఅందుకున్న సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఆసీస్ విధించిన 338 పరుగుల లక్ష్యాన్ని భారత్ 9 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. జెమీమా రోడ్రిగ్స్(127 నాటౌట్) అజేయ శతకంతో ఈ మ్యాచ్‌లో సత్తా చాటింది. ఈ గెలుపు ఉత్సాహంతో ఫైనల్లో సౌతాఫ్రికాను ఓడించి తొలిసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది. మరోసారి అదే తరహా ప్రదర్శనతో తొలి టీ20 ప్రపం చకప్‌ను ముద్దాడాలనే కసితో హర్మన్ సేన ఉంది.






## మర్డర్ మిస్టరీలో తత్వం

మర్డర్ మిస్టరీ జానర్‌లో.. ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ ఇచ్చేందుకు సిద్ధమవుతోన్న చిత్రం 'తత్వం'. దినేష్ తేజ్, దష్విక.కె హీరోహీరోయిన్లుగా నటిస్తోన్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటూ.. సినిమాపై అంచనాలను పెంచేస్తోంది. సైతాన్ సంతానమే గ్రహణం రోజు పుట్టి సైకోలుగా ప్రవర్తిస్తుంటారనే పాయింట్‌ని బేస్ చేసుకుని, ఈ సినిమా రూపుదిద్దుకున్నట్లుగా ట్రైలర్‌లో చూపించారు. అలాంటి టైమ్‌లో పుట్టిన ఓ వ్యక్తి చేసే హత్యల చుట్టూ కథని నడిపిస్తూ.. నిజంగా ఆ హత్యలను ఆ వ్యక్తే చేస్తున్నాడా? లేదంటే వేరే ఎవరైనా చేయిస్తున్నారా? అనే క్యూరియాసిటీని పెంచేలా ఈ ట్రైలర్‌ని కట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్రైలర్ టాప్‌లో ట్రెండ్ అవుతోంది.

## కెరీర్ ప్రారంభంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను : కృతి సనన్

కృతి సనన్ ఇటీవల 'కాక్‌టెయిల్-2'తో బాలీవుడ్‌లో భారీ హిట్ సాధించింది. ప్రస్తుతం తెలుగు సినిమా పరిశ్రమ నుంచి బంపర్ ఆఫర్ అందుకుంది. విజయ్ దేవరకొండ, శౌర్యువ్‌తో కలిసి పాన్ ఇండియా స్థాయి చిత్రంలో కీలక పాత్రలో నటించనుందనే వార్త హల్‌చల్ చేస్తోంది. మరోవైపు, ఓ ఇంటర్వ్యూలో కృతి తన 12 ఏళ్ల సినిమా ప్రయాణం గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యింది.

"ప్రారంభంలో చాలా కష్టాలు పడ్డాను. మోడలింగ్ రోజుల్లో నా మొదటి ఫొటో షూట్, మొదటి ర్యాంప్ వాక్ రెండూ పూర్తిగా ఫ్లాప్ అయ్యాయి. ఇంటికి వెళ్లి ఏడ్చాను. కానీ ఆపకుండా మళ్లీ ఆడిషన్లు చేశాను. ఆ పట్టుదలే నన్ను ఇక్కడి వరకు తీసుకొచ్చింది" అని గుర్తు చేసుకుంది.

అంతేకాదు, బాలీవుడ్‌లోని నెపోటిజం పైనా కృతి తీవ్రంగా స్పందించింది. రణ్‌బీర్ కపూర్, అలియా భట్ లాంటి స్టార్ కిడ్స్ లో టాలెంట్ ఉందని, కష్టపడి నిరూపించుకున్నారని చెప్పిన కృతి... టాలెంట్ లేని కొందరు కేవలం ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ కారణంగా 8-9 ఏళ్ల పాటు వరుసగా అవకాశాలు పొందడం అన్యాయమని మండిపడింది.

బ్యాక్‌గ్రౌండ్ లేని నటీనటులు మొదటి 2-3 ఏళ్లలోనే హిట్‌లు కొట్టకపోతే ఇండస్ట్రీ వారిని పక్కకు నెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## మరో మూడు నెలల్లో వారణాసి పూర్తి


### ముఖ్యమైన షూటింగ్ పూర్తి చేశామన్న జక్కన్న



మహేశ్ బాబు, ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి' సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ సినీ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. ఈ చిత్ర షూటింగ్ మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా పూర్తిగా ముగియనుందని దర్శకుడు రాజమౌళి స్వయంగా వెల్లడించారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆయన ఒక అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలను పంచుకున్నారు. సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణతో పాటు వారణాసిలోని ముఖ్యమైన భాగాల షూటింగ్ కూడా ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం కేవలం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను మాత్రమే తెరకెక్కిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడంపై రాజమౌళి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కథ ఐమాక్స్ స్క్రీన్‌పై చూస్తేనే అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని తాము ముందుగానే భావించామని, అయితే ఈ ఫార్మాట్ కోసం కథలో ఎలాంటి ప్రధాన మార్పులు చేయలేదని కేవలం సాంకేతిక పరమైన సర్దుబాట్లు మాత్రమే చేశామని తెలిపారు. సాధారణంగా మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్‌కు అలవాటు పడ్డాయని, అందువల్ల అటు ఐమాక్స్, ఇటు సినిమా స్కోప్ రెండింటికీ సరిపోయేలా 'అనోమార్ఫిక్ ఫ్రేమింగ్' పద్ధతిని ఉపయోగించి దృశ్యాలను చిత్రీకరించినట్లు వివరించారు. దీనికోసం ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ఆ తర్వాత పని చాలా సులభంగా సాగిపోయిందని జక్కన్న చెప్పుకొచ్చారు. ఇక గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది.

## రణబాలి షూటింగ్‌లో విజయ్ గొంతెమ్మ కోర్కెలు

### సోషల్ మీడియా అసత్య ప్రచారాలను తిప్పికొట్టిన నిర్మాత



టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆయన నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఇటీవల ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్‌గా మారాయి. 'రణబాలి' చిత్రీకరణ సమయంలో విజయ్ దేవరకొండ ఐదు కారవాన్లు ఏర్పాటు చేయాలని కోరారని, తన వెంట పెద్ద సంఖ్యలో అసిస్టెంట్లు ఉండాలని డిమాండ్ చేశారనే ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ వార్తలు అభిమానుల్లో చర్చకు దారితీశాయి. ఈ ప్రచారంపై ఇప్పటికే విజయ్ దేవరకొండ బృందం స్పందించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేసింది. హీరోపై కావాలనే తప్పుడు ప్రచారం జరుగుతోందని పేర్కొంది. అసత్య కథనాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని విజయ్

టీమ్ హెచ్చరించింది. తాజాగా ఈ వివాదంపై చిత్ర నిర్మాత రవి కూడా స్పందించారు. షూటింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, విజయ్ దేవరకొండ నుంచి అసాధారణమైన డిమాండ్లు ఏవీ రాలేదని ఆయన స్పష్టం చేశారు. విజయ్ ఎప్పుడూ పనిపట్ల నిబద్ధతతో వ్యవహరిస్తారని, సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తారని నిర్మాత తెలిపారు. ఆయనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. ఇక 'రణబాలి' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇప్పటికే మంచి బజ్ ఏర్పడింది. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'రణబాలి' చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తయింది. మిగిలిన భాగాన్ని వేగంగా పూర్తి చేసి సినిమాను సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## ఒకే ఫ్రేమ్‌లో చిరు, నాగ్, వెంకీ..

### ఖుష్బూ కూతురి పెళ్లిలో సందడి




ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్ ఇంట పెళ్లి సందడి నెలకొంది. ఆమె పెద్ద కుమార్తె అవంతిక వివాహం గోవాలో అత్యంత వైభవంగా జరిగింది. చెన్నైకి చెందిన వ్యాపారవేత్త శ్రవణ్ శ్రీనివాసన్‌తో అవంతిక వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. గోవాలోని ఒక విలాసవంతమైన రిసార్ట్‌లో జరిగిన ఈ వేడుకకు పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ పెళ్లి వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఈ వివాహ వేడుకలో టాలీవుడ్ సీనియర్ హీరోలు చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ముగ్గురు కథానాయకులు తమ సతీమణులు సురేఖ, అమల, నీరజలతో కలిసి హాజరయ్యారు. సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిన ఈ తారలంతా నూతన దంపతులతో ఫొటోలు దిగి సందడి చేశారు. వీరితో పాటు బాలీవుడ్ నటులు అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్, నటి త్రిష కూడా ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. దీంతో 80, 90ల నాటి తారలంతా ఒకేచోట చేరిన అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది.

ఖుష్బూకు టాలీవుడ్‌లోని ఈ ముగ్గురు అగ్ర హీరోలతో మంచి అనుబంధం ఉంది. 'కలియుగ పాండవులు' చిత్రంతో వెంకటేశ్, ఖుష్బూ ఇద్దరూ దాదాపు ఒకే సమయంలో కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత నాగార్జునతో 'కెప్టెన్ నాగార్జున' చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటించారు. ఇక, చిరంజీవి నటించిన 'స్టాలిన్' సినిమాలో ఖుష్బూ ఆయనకు సోదరిగా కీలక పాత్ర పోషించారు. వృత్తిపరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా వీరందరి మధ్య స్నేహబంధం కొనసాగుతోంది. వెండితెరపై ఒకరితో ఒకరు పోటీపడినా, నిజ జీవితంలో మంచి స్నేహితులుగా మెలిగే చిరు, నాగ్, వెంకీ.. తమ స్నేహితురాలి కుమార్తె వివాహంలో ఇలా ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## మా ఇంటి బంగారం కోసం సమంతను ఒప్పించా: రాజ్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, థ్రిల్లింగ్ అంశాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. విడుదలైన తొలి వారం రోజుల్లోనే భారీ వసూళ్లు సాధించిన ఈ సినిమా ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ విజయాన్ని సెలబ్రేట్ చేసేందుకు హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నిర్మాత, దర్శకుడు రాజ్ నిడిమోరు చేసిన వ్యాఖ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సమంత వ్యక్తిగత జీవితం, కెరీర్, ఈ సినిమా ప్రయాణం గురించి ఆయన పంచుకున్న విషయాలు అందరినీ భావోద్వేగానికి గురిచేశాయి. మేము ఎన్నో హిందీ ప్రాజెక్టులు చేశాం. 'ది ఫ్యామిలీ మ్యాన్', 'స్త్రీ' వంటి ప్రాజెక్టులు దేశవ్యాప్తంగా బ్లాక్‌బస్టర్లుగా నిలిచాయి. కానీ 'మా ఇంటి బంగారం' ఇచ్చిన తృప్తి మాత్రం పూర్తిగా భిన్నం. ఈ సినిమా నాకు గుండెకు చాలా దగ్గరైంది. తెలుగు ప్రేక్షకులు చూపించిన ప్రేమ, ఆదరణ నాకు జీవితాంతం గుర్తుండిపోతుంది' అని రాజ్ చెప్పారు. సినిమా నిర్మాణ సమయంలో ఎదురైన సవాళ్లను గుర్తు చేసుకున్న రాజ్, ఒక ఆసక్తికర విషయాన్ని కూడా వెల్లడించారు. ఈ సినిమా ప్రారంభమైన సమయంలో సమంత వ్యక్తిగత జీవితం, ఆరోగ్యంపై బయట ఎన్నో రకాల ప్రచారాలు జరిగాయి. ఆ సమయంలో ఆమె సినిమాలకు దూరంగా ఉండాలనే ఆలోచనలో ఉండేది. నిజానికి ఇక సినిమాలు చేయకూడదని కూడా అనుకుంది. అయితే కనీసం ఈ ఒక్క సినిమా అయినా చేయాలని నేనే బలవంతం చేసి ఒప్పించాను అని రాజ్ వెల్లడించారు.

